

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...


ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం

విజయనగరం

సోమవారం 12-01-2026 పేజీలు : 17


## నగరం పల్లెబాట



- ఉత్తరాంధ్ర లో సంక్రాంతి రద్దీ
- పండుగకు సొంత ఊర్లకు తరలి వెళ్తున్న ప్రజలు
- కిక్కురేస్తున్న ఆర్టీసీ బస్సులు,రైళ్లు

2వ పేజీలో

## కోడి పందేలపై సీపీ నిఘా...



- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక
- కోడి పందేలపై కోర్టు ఆదేశాలు పాటించాలి

3వ పేజీలో

## ఘనంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు

### యువతకు స్ఫూర్తినిచ్చిన స్వామి వివేకానంద జయంతి..



మల్కాపురం, జనవరి 12, మేజర్‌న్యూస్: "లేచి నిలబడి లక్ష్యాన్ని చేరేవరకు ఆగొద్దు" అనే స్వామి వివేకానందుడి సందేశాన్ని మరోసారి యువతకు గుర్తు చేస్తూ, జాతీయ యువజన దినోత్సవాన్ని

(వార్త 3వ పేజీలో )

## మహిళా పొదుపు సంఘాలలో ఆర్పీల చేతివాటం?




- గ్రూపుల నిర్వహణలో కొనసాగుతున్న అక్రమాలు
- చేతివాటం చూపిస్తున్న కొందరు ఆర్పీలు
- బహిరంగంగా పర్సంటేజీల వసూళ్లు
- ఆరోపణలు ఉన్న ఆర్పీలకు అధికారుల అండదండలు
- నిబంధనలు అతిక్రమించి కొనసాగుతున్న వైనం
- నిలదీసి అడిగే వారిపై వేధింపు చర్యలు

2వ పేజీలో

## నేడు వర్చువల్‌గా జిల్లా కలెక్టర్లు తో సిఎం..

- మంత్రులు, సెక్రటరీలతో సీఎం చంద్రబాబు నేడు సమావేశం
- వర్చువల్‌గా హాజరుకానున్న ఉత్తరాంధ్ర కలెక్టర్లు



3వ పేజీలో

# పల్లె బాట పట్టిన నగరం..

- రద్దీతో ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ
- పండుగ డిమాండ్ తో ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- టోల్ ప్లాజ్ వద్ద వాహనాలు క్యూ
- పండగ తో జగదాంబ జంక్షన్ ట్రాఫిక్ దిగ్బంధం

(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)

సంక్రాంతి పండుగ సమీపిస్తుండడం,స్కూళ్లకు, కళాశాలలకు, పలు కార్యాలయాలకు సెలవులు రావడంతో ప్రజలు పల్లె బాట పట్టారు. మూడురోజులు జరిగే సంక్రాంతి సంబురాలను పల్లెల్లో ఘనంగా జరుపుకోనున్నారు. విశాఖలో ఉపాధి నిమిత్తం, చదువు నిమిత్తం వచ్చి ఇక్కడ ఉంటున్న పెద్ద సంఖ్యలో వారు వారంతా పల్లెలకు బయలుదేరడంతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. శనివారం సాయంత్రం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు విశాఖ నుంచి భారీ సంఖ్యలో పలు వాహనాలు వెళ్లడం జరిగింది. అలాగే ఆదివారం రాత్రి వరకు కూడా విశాఖ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సంక్రాంతి పండుగ చేసుకోవడానికి తమ సొంత ఊరికి వెళుతూ ఉండటంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. బస్సులు, ప్రైవేట్ వాహనాలతో పాటు అధికశాతం



మంది తమ సొంత వాహనాల్లో తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు కూడా తగు చర్యలు తీసుకోవడం జరిగింది. సంక్రాంతి పండుగకోసం నగర వాసులు పల్లెబాట పట్టడంతో నగరంలోనిఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోపాయి. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. మరోవైపు రైల్వేసైతం స్పెషల్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. సొంత ఊర్లకు వెళుతున్న వారిని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. వెళ్లే వారి రద్దీకి తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు, రైళ్లు లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే అధిక ధరలు వసూలు చేసే ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ ఇక సంక్రాంతి సందర్భంగా మామూలుగా ఉండదు. ఆర్టీసీ బస్సులు ఏ మూలకు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.పండుగ డిమాండ్ మేరకుదీనిని సొమ్ము చేసుకోవడానికి ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు టికెట్ ధరలను అమాంతంగా పెంచేశారు. ఈ క్రమంలో ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టేందుకు, ఫిట్ నెస్ లేని బస్సులు కూడా రోడ్డు మీదకు వస్తున్నాయి. రద్దీకి తగ్గట్లుగా బస్సులు నడపడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని దోపిడీని కొనసాగిస్తూ ప్రైవేటు ట్రావెల్స్ మాఫియా మారాయనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. గ్రామాలకు వెళ్లే ప్రయాణాలకు అసౌకర్యం కలగకుండా ఉండే విధంగా అదనపు బస్సులను పెట్టి తగిన ఏర్పాట్లు చేశారు. అయినా అవి ఏ మూలకు సరిపోకపోవడంతో ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఊరేలుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ట్రావెల్స్ నిలువు దోపిడీని నిలువరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. శనివారం అలాగే ఆదివారం పెద్ద సంఖ్యలో విశాఖ నుంచి పలువురు తమ సొంత ఊర్లకు బయలుదేరారు.సోమవారం నాడు కూడా మిగతావారు బయలుదేరి అవకాశం ఉంది. జాతీయ రహదారి మాత్రమే కాకుండా, నగంలో ఉన్న ప్రధాన రహదారి జంక్షన్ లలో కూడా వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.ఒకపక్క ఆర్టిసి బస్సులు, మరోపక్క ప్రైవేట్ బస్సులు, అది కాకుండా ఇతర ప్రైవేటు వాహనాలతో పాటు కొందరు తమ సొంత వాహనాలలోనే పండుగ వెళ్తూ ఉండటం తో రోడ్లన్నీ ఇరుకుగా మారాయి.అటు



ట్రాఫిక్ పోలీసులు కూడా ఎక్కడికక్కడ ట్రాఫిక్ రద్దీని క్లియర్ చేస్తూ వస్తున్నారు.అయినప్పటికీ కూడా విశాఖ నగరం నుంచి బయటకు వెళ్తున్న వాహనాల సంఖ్య ఎక్కువ ఉండటంతో రద్దీ కొనసాగుతూ ఉంది.అయితే చాలా వరకు చాలామంది తమ ఊర్లు వెళ్ళేందుకు ప్రైవేట్ బస్సులను ఆశ్రయించడం జరుగుతుంది.ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు దోపిడి చేస్తున్నప్పటికీ ఇక తప్పని పరిస్థితుల్లో ప్రయాణించవలసి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



# మహిళా పొదుపు సంఘాలలో అవకతవకులు..?

- అక్రమాలకు పాల్పడుతున్న ఆర్పీలపై పై చర్యలు తీసుకోవాలని పొదుపు సంఘాల సభ్యుల డిమాండ్

(విశాఖపట్నం : మేజర్ న్యూస్)

మహిళా పొదుపు సంఘాలకు సంబంధించి బ్యాంక్ రుణాలు మంజూరు చేయించడం, ప్రతీ నెల సంఘాల సమావేశాలు నిర్వహించి పుస్తక నిర్వహణ, పొదుపు, అప్పులు, బ్యాంకు లావాదేవీలు సక్రమంగా జరిగే విధంగా చూడటానికి ఆర్పీ (రీసోర్స్ పర్సన్) వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన ఆర్పీలు తమ చేతివాటం ప్రదర్శించి, రుణం మంజూరు చేసే సమయంలో తమ తెలివితేటలు చూపించి సంఘాలకు కుచ్చుటోపి పెట్టే ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. 36వ వార్డులో కూడా కొందరు ఆర్పీలు తమ చేతివాటం ప్రదర్శించి అందిన కాడ దోచుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.వార్డులో మొత్తంగా పనిచేస్తున్న ఆర్పీలలో కొంతమంది పై పొదుపు సంఘాల సభ్యుల బాహటంగానే ఆరోపణలు గుప్పిస్తుండటం జరుగుతుంది.అందులో ఒక ఆర్పీ పై అయితే గ్రూపు సభ్యులే నేరుగా నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. పొదుపు సంఘాలలో జరుగుతున్న అవకతవకలలో ఆర్పీలు , గ్రూపు ప్రెసిడెంట్ ల ప్రధాన పాత్ర ఉన్నట్లు తెలుస్తుంది.సంఘాల వద్ద ప్రతినెల డబ్బులు వసూలు చేసి బ్యాంకుకు కట్టకుండా, ఆ డబ్బులు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు.బ్యాంకుకు సరిగా డబ్బులు జమ చేయకపోవడంతో ఆ పొదుపు సంఘాలకు కొత్త లోన్లు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరించడం జరుగుతుంది.అందుకు కారణం తెలుసుకున్న పొదుపు సంఘాలు ఆర్పీల పై మండిపడుతున్నారు.

## కొనసాగుతున్న అక్రమాలు..!!

36వ వార్డు మహిళా పొదుపు సంఘాలలో యదేచ్ఛగా అవకతవకలు జరుగుతున్నట్లు తెలుస్తుంది.అధికారులు,ఆర్పీల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం అంతా జరుగుతున్నట్లు బాధితులే చెబుతున్నారు.ఆర్పీలకు పొదుపు సంఘాల ప్రెసిడెంట్లు కూడా సహకరిస్తూ ఉండటంతో యదేచ్ఛగా మోసాలు కొనసాగుతున్నట్లు పేర్కొంటున్నారు.36వ వార్డులో పనిచేస్తున్న ఒక ఆర్పీ వ్యవహార శైలిపై పొదుపు సంఘాల సభ్యులు ఆగ్రహంగా ఉన్నారు. లోను వచ్చిన తర్వాత వారి నుంచి కొంత నగదును పర్సంటేజీగా తీసుకోవడమే కాకుండా,బ్యాంకులో జమ చేయమని ఇచ్చే నగదును తన సొంత పనులకు వినియోగించి ఆ గ్రూపులను మోసం చేస్తూ ఉండటం జరుగుతుంది.ఇదేంటి అని నిలదీసి అడిగిన గ్రూపు సభ్యులపై సదరు ఆర్పీ తిరిగి గొడవ పడుతుండటం కొసమెరుపు.సదరు ఆర్పీకు గ్రూపు ప్రెసిడెంట్ కూడా వత్తాసు పలకడం విశేషం.అధికారులు కూడా వీరికి వంత పాడటం జరుగుతుంది.ఏదైనా ఉంటే మీరు మీరు చూసుకోండి మాకు సంబంధం లేదన్నట్లుగా అధికారులు చెబుతూ ఉండటం పట్ల పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్యాయం జరిగిందని చెబితే దానిపై స్పందించకుండా అన్యాయం చేసిన వారిని అధికారులు సమర్థించడం ఎంతవరకు సమంజసం అని మహిళలు సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు.సదరు ఆర్పీ కుమార్తె ప్రభుత్వ ఉద్యోగి అయిన సరే ఆమెను గ్రూపులో చేర్పించి బ్యాంకుల నుంచి లోను తీసుకోవడం చట్ట విరుద్ధమని తెలిసినా కూడా ఆ ఆర్పీ అవేమీ పట్టించుకోకుండా తనకు అధికారుల అండదండలు ఉన్నాయని బహిరంగంగా చెబుతూ అక్రమాలకు తెర తీస్తూ ఉండటం వివాదాస్పదంగా మారింది.

## ప్రభుత్వ నిబంధనలకు తూట్లు..

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచే విధంగా ఆర్పీలు వ్యవహరిస్తున్నారు.36వ వార్డులో పనిచేస్తున్న చాలామంది ఆర్పీలకు 10 సంవత్సరాల నుంచి జీతాలు ఇవ్వడం లేదని తెలుస్తుంది.ఇందులో కొందరు అనర్హులు కూడా ఉన్నారు.ఆర్పీ లు గా పనిచేసే వారు కచ్చితంగా 10వ తరగతి పాస్ అయి ఉండాలి.ఆరు, ఏడు తరగతులు చదివిన వారు ఈ వార్డులో ఆర్పీలు కొనసాగుతూ ఉండటం అధికారులకు తెలిసిన తమకేమీ తెలియనట్లు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.గ్రూపు సభ్యుల నుంచి పర్సంటేజీ ల రూపంలో డబ్బులు వసూలు చేయడమే కాకుండా ఒకే వ్యక్తిని రెండు మూడు గ్రూపులలో పెట్టించి వారి చేత లోన్లు తీయించి ఆ డబ్బులు వారే తీసుకోవడం జరుగుతుంది.వాస్తవంగా ఒక గ్రూపులో ఉన్న సభ్యులు మరొక గ్రూపులో ఉండడానికి అవకాశం లేదు.కానీ ఇక్కడ ఉన్న సదరు ఆర్పీ అయితే అవేమీ తనకు పట్టనట్లు వ్యవహరిస్తూ అడ్డుగోలుగా వ్యవహరిస్తూ ఉండటం జరుగుతుంది.రెండు మూడు గ్రూపులలో సభ్యులను పెట్టి బినామీ పేర్లతో ఆ డబ్బులను తనే తీసుకోవడం జరుగుతుంది.తెల్ల రేషన్ కార్డులు ఉన్న వాళ్లే అర్హులు, ఉద్యోగం చేసే వాళ్ళు అనర్హులు అయిన కూడా వాళ్లే వుంటున్నారు.

## పెద్ద మొత్తంలో డబ్బులు కాజేత..?

ఈ వార్డులో ఉన్న ఒక ఆర్పీ ఒక గ్రూపు బ్యాంకులో జమ చేయమని ఇచ్చిన పెద్ద మొత్తాన్ని కట్టకుండా తను సొంతంగా వాడుకోవడం జరిగింది.తర్వాత అసలు విషయం తెలిసిన గ్రూప్ సభ్యులు ఆ ఆర్పీని నిలదీస్తే మీరు నన్ను ఏమి చేయలేరు, ఎవరికి చెప్పుకుంటే చెప్పుకోండి అంటూ తిరిగి బెదిరించడం జరుగుతుంది.ఆర్పీ తో పాటు ఆ గ్రూపు ప్రెసిడెంట్ కూడా కుమ్మక్కై బ్యాంకుకు జమ చేయవలసిన డబ్బులు తినేసారని సభ్యులే ఆరోపిస్తున్నారు.దీనికి సంబంధించి అధికారులకు కూడా సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగింది.అయితే ఇదిలా ఉండగా ఆ గ్రూప్ సభ్యుల డిమాండ్ తో ఇక ఆ గ్రూపుకి తనకు ఎటువంటి సంబంధం లేదని సంతకాలు చేయడం కూడా జరిగింది.ఆ గ్రూపు సభ్యులు తర్వాత లోను తీసుకున్నారు.తన ప్రమేయం లేకుండా వీరికి ఎలా లోన్ మంజూరు చేశారని అటు బ్యాంక్ అధికారులను అలాగే ప్రభుత్వ అధికారులను ఆ ఆర్పీ బెదిరించడం జరుగుతుంది.సదరు గ్రూపుతోతనకు సంబంధం లేదని సంతకం చేసిన ఆర్పీ తర్వాత ఆ గ్రూప్ సభ్యులను వేధించడం కొనసాగిస్తూ ఉండటం జరుగుతుంది.ఆ గ్రూపు కి ఎవరు సహాయం చేయకూడదని, ఏ బ్యాంకు కూడా లోన్ ఇవ్వరాదని బెదిరింపులకు పాల్పడడం పై ఆ గ్రూపు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఎవరు స్పందించడం లేదని అంటున్నారు.ఒక అధికారి అలాగే ఒక ఆర్పీ కలిసి సంఘం సభ్యులను ఫోన్ ద్వారా బెదిరించడం జరిగిందని, ఆ ఫోన్ రికార్డులు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

## అధికారుల అండదండలు..!

నిబంధనలకు విరుద్ధంగా 36వ వార్డులో పని చేస్తున్న కొందరు ఆర్పీ పై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహిస్తూ ఉండటం పై విమర్శలు వస్తున్నాయి.ఆర్పీ లు చేసే అక్రమాలకు అధికారులు కూడా మద్దతు ఇవ్వడం పట్ల పొదుపు గ్రూపు సంఘాల సభ్యులు మండిపడుతున్నారు.వయసు పైబడిన వారిని అలాగే అడ్డగోలుగా అక్రమాల చేసే వారిని అధికారులు ప్రోత్సహించడం సరికాదని పలువురు అంటున్నారు.అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## తగు చర్యలు తీసుకోవాలి..

మహిళా పొదుపు సంఘాలను మోసం చేస్తూ, పర్సంటేజ్ ల రూపంలో అడ్డుగోలుగా డబ్బులు వసూలు చేస్తూ, ఇద్దరు ముగ్గురును వేరు వేరు గ్రూపులలో తమ బినామీలుగా పెట్టించి వారికి లోన్ లు ఇప్పించి ఆ డబ్బులు తీసుకుంటున్న ఆర్పీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇక్కడ ఒక ఆర్పీ ఒక గ్రూపు నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని బ్యాంకుకు కట్టకుండా తన సొంత ప్రయోజనాలకు వాడుకొని, ఆ డబ్బులు తిరిగి ఇవ్వకుండా, గట్టిగా నిలదీసి అడిగిన వారిపై బెదిరింపులకు పాల్పడుతూ, దౌర్జన్యం చేస్తూ ఉండటం పట్ల మండిపడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని వాపోతున్నారు.ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించాలని, లేదంటే తమ వద్ద ఆధారాలు ఉన్నాయని,ఆ ఆధారాలతో చట్టపరంగా వెళ్తామని హెచ్చరిస్తున్నారు.

# కోడి పందేలపై సీపీ నిఘా..!

➪ చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఇప్పటికే కోర్టు ఆదేశం ➪ అవసరమైతే 144 సెక్షన్ విధించాలని కోర్టు వెల్లడి
➪ అన్ని స్టేషన్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన సీపీ ➪ డ్రోన్ కెమెరాల తో నిఘా షురూ..

(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)



ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు కోడి పందేల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు.కోర్టు ఆదేశాలు పాటించకుండా ఎవరైనా కోడిపందాలు నిర్వహించినట్లయితే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు.ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో పోలీస్ నిఘా పెట్టామని చెప్పారు.అన్ని స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అలాగే శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల తో కోడి పందేలు నిర్వహిస్తే పట్టుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.ఈ విషయంలో ఎవరిని వదిలే ప్రసక్తి లేదని పేర్కొన్నారు.విశాఖ నగర శివారు ప్రాంతాలలో పోలీసు భద్రతను కట్టుదిట్టం చేయడం జరిగిందన్నారు.రాత్రి, పగటి వేళలో ఈ బందోబస్తు కొనసాగుతుందని వెల్లడించారు.సంక్రాంతి పండుగ అయ్యేవరకు పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు.హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు తగు చర్యలు ఉంటాయని వెల్లడించారు.కోడి పందేల మాటున అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అందుకే విశాఖ పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.ముఖ్యంగా కోడి పందేలు నిర్వహించే ప్రాంతాలలో బందోబస్తు పెట్టామని,ఎటువంటి కోడిపందాలు నిర్వహించిన సరే వారిపై చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.



### కోడి పందేల పై హైకోర్టు కీలక ఆదేశాలు..

సంక్రాంతి పండుగ వేళ కోడి పందాల నిర్వహణకు బరులను సిద్ధం చేసుకుంటున్న సమయంలో సంగతి కోడి పందాలకు సంబంధించి ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోడి పందాలు, సంబంధిత బెట్టింగ్ కార్యకలాపాలను నిషేధించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను ఆదేశించింది.సంక్రాంతి పండుగ వేళ కోడి పందాల నిర్వహణలో కోళ్ల కాళ్లకు కత్తులు కట్టడం ద్వారా జీవహింసకు పాల్పడుతున్నారని, అక్రమ మద్యం, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని,వాటిని నిలువరించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా 2019లో జారీ చేసి ఆదేశాలను కోర్టు అధికారులకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గుర్తుచేశారు. అలాగే గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులకు అనుగుణంగా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే సంఘాలు ఏర్పాటు చేయాలని, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, జంతు సంక్షేమ సంస్థల ప్రతినిధులతో కూడిన ఉమ్మడి తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమలు చేయడం ద్వారా కోడి పందాలు జరగకుండా చూడాలని చెప్పారు. ఇందుకోసం ఉపయోగించే పరికరాలను,బెట్టింగ్ డబ్బును స్వాధీనం చేసుకోవాలని అధికారులను జస్టిస్ వెంకట జ్యోతిర్మయి తెలిపారు.

### చట్ట విరుద్ధ ఆటల పై పోలీసు దృష్టి..!

కోడి పందాలు,పేకాట, జూదం,బల్లాట,క్యాసినో వంటి ఇతర ఏ ఆటలు ఆడిన ఉపేక్షించేది లేదని ఏసీపీ,సీఐ లకు సీపీ శంఖబ్రతబాగ్చి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అత్యధికంగా నగర శివారు ప్రాంతాల్లో ఇలాంటి ఆ సాంఘిక కార్యకలాపాలు పాల్పడతారని,ముందస్తు గట్టి నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తే మళ్ళీ వారిపై బైండవార్ కేసులు పెట్టి వార్న్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.కోర్టు నిబంధనలు ప్రకారం పోలీసులు నడుచుకోవాలని అధికారుల కు సూచించారు.ప్రతి స్టేషన్ పరిధిలో నిఘా కట్టుదిట్ట చేసి ఆ సాంఘిక శక్తుల పై ఉక్కుపాదం మోపాలని కోరారు.

# నేడు వర్చువల్‌గా జిల్లా కలెక్టర్లు తో సిఎం..

**విశాఖ సిటీ, జనవరి 11, మేజర్‌న్యూస్:** రాష్ట్ర మంత్రులు, సెక్రటరీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సమావేశం కానున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు సచివాలయంలో వారితో సమావేశం అవుతారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా హాజరుకానున్నారు. జీఎస్డీపీ, 2047 విజన్‌లోని 10 సూత్రాలపై సంబంధిత అధికారులు సమావేశంలో ప్రజంటేషన్ ఇస్తారు. అనంతరం ఆదాయార్జన, కేంద్ర ప్రాయోజిత పథకాలు, పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, పెట్టుబడులు, దస్త్రాల పరిష్కారం, ఆన్‌లైన్ సేవలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై సీఎం సమీక్షిస్తారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, సర్వే, ఫిర్యాదుల పరిష్కారం, రిజిస్ట్రేషన్ సేవలు, బ్లాక్ చైన్ విధానంతో ప్రజల ఆస్తులకు రక్షణ వంటి వాటిపై అధికారులు, మంత్రులకు దిశానిర్దేశం చేస్తారు. అదే విధంగా ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన వీబీ-జీ-రామ్ జీ పైనా మంత్రులు, అధికారులతో సీఎం చర్చిస్తారు.

# ఘనంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు

మొదటిపేజీ తరువాయి

విశాఖ పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమాలు యువతలో కొత్త ఉత్సాహం, చైతన్యాన్ని నింపాయి. ఈ సందర్భంగా గాజువాక డిపో వద్ద నిర్వహించిన 5 కిలోమీటర్ల రన్‌లో రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని యువతతో కలిసి అడుగులు వేశారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వామి వివేకానందుడి జీవితం, త్యాగం, సేవాభావం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, దేశభక్తితో యువత ముందుకు సాగితేనే బలమైన భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉత్సాహంగా మద్దతు తెలిపారు. స్వామి వివేకానంద ఆలోచనలు ప్రతి యువ హృదయంలో నిత్యం ప్రతిధ్వనించాలనే సంకల్పంతో కార్యక్రమం ముగిసింది.

# క్రీడలతో శారీరక ఆరోగ్యం

### సీఐ సిహెచ్ వాసు నాయుడు



**అనందపురం, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలోని గొట్టిపల్లి శ్రీ సీతారామ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని గొట్టిపల్లి ప్రీమియర్ లీగ్ (జిపిఎల్ 3) క్రికెట్ టోర్నమెంట్ ను ఆనందపురం సిఐ సిహెచ్ వాసు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా తో పాటు క్రీడల్లో రాణించాలని వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అంతేకాకుండా క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు శారీర దారుధ్యానికి మెరుగవుతుందని చెప్పారు.యువత ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమన్నారు. అనంతరం ఆయన బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు. జిపిఎల్ ఫౌండర్ ఎద్దు వీరస్వామి మాట్లాడుతూ గతంలో రెండు జిపిఎల్ టోర్నమెంట్లు నిర్వహించడం జరిగిందని ఇది మూడవ జిపిఎల్ అని ఆయన తెలియజేశారు. జిపిఎల్ 3లో ఐదు టీములు ఆడనున్నాయన్నారు.విన్నర్ రన్నర్ లకు నగదు ప్రోత్సాహాలతో పాటు ట్రోఫీలను కూడా తీర్థ మహోత్సవం నాడు దాతల సహాయంతో అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమములో మాజీ సర్పంచ్ కోరాడ వెంకట నరసింహానాయుడు ( వెంకట్రావు ), శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, జిపిఎల్ ఫౌండర్ ఎద్దు వీరాస్వామి,ఫిజికల్ డైరెక్టర్లు బుత్తల సత్యం, బుత్తలరాము, కంది సత్తిబాబు, కేశా నాగేశ్వరరావు ,క్రికెట్ టోర్నమెంట్ మెంబర్ లు ఐదు టీంలు ప్రాంచెస్ యజమానులు, టీం ప్లేయర్స్ తదితరుల పాల్గొన్నారు.

# ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ పట్నాయక్



**అనందపురం, జనవరి 11, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శిగా జీటీవీ సుదర్శన్ పట్నాయక్ ఎన్నికైయ్యారు.ఈయన స్వగ్రామం ఆనందపురం.రాష్ట్ర అధ్యక్షులు సవన్నగారి బాలాజీ ఈ మేరకు నియామక పత్రాన్ని ఆదివారం అందచేశారు. ప్రధాన కార్యదర్శి గా సుదర్శన్ పట్నాయక్ పేరును జిల్లా అధ్యక్షులు అవనాపు అరుణ్ కుమార్ అధ్యక్షతన మధురవాడ లో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశం లో శనివారం ఏకగ్రీవం గా ఎన్నుకొన్నారు. కాగా సుదర్శన్ పట్నాయక్ ను రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చిన్న చిరంజీవి పర్యటన కార్యదర్శి ఎం పి శ్రీనివాస్ గోపినాథ్ కరుణ కుమార్ శంకర్ అప్పారావు అప్పలరాజు గుప్తా ఫణికుమార్ అభినందించారు.

# నేడు 'జీవీఎంసీ బడ్జెట్ణ భేటీ

**విశాఖపట్నం, జనవరి 11, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్పై చర్చించేం దుకు నేడు స్థాయీ సంఘం సమావేశం కానుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ పీలా శ్రీనివాస రావు అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. సుమారు రూ.3,750 కోట్ల అంచనాలతో రూపొందించిన వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై స్థాయీ సంఘ సభ్యులు చర్చించి, అవసరమైన మార్పులు, చేర్పులతో కౌన్సిల్ ఆమోదానికి పంపనున్నారు. ఈ సమావేశంలో ప్రారంభనిల్వ, వివిధ పద్దుల కింద వచ్చే ఆదాయ వ్యయాలు, ముగింపు నిల్వ, అలాగే ఏయే విభాగానికి ఎంతమేర నిధులు కేటాయించారు అనే అంశాలపై క్షుణ్ణంగా చర్చ జరగనుంది.




## పల్లెల్లో జాతరలకు ముస్తాబవుతున్న దేవాలయాలు



**కొత్తవలస. జనవరి 10. మేజర్ న్యూస్ :** మండలంలో పల్లెల్లో ఉన్న దేవాలయాలన్ని జాతర్లు సిద్ధమవుతున్నాయి. జనవరి మాసంలో వచ్చే భోగి సంక్రాంతి కనుము పండగ వెళ్లగానే మండలంలో ఉన్న పల్లెల్లో జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలన్ని కొత్త కొత్త పెయింట్లు వేస్తే ముస్తాబు చేస్తారు. ఈ నేపథ్యంలోనే కొత్త సుంకరపాలెం గ్రామంలో జనవరి 23న శుక్రవారం జరగబోయే గ్రామదేవత రావాలమ్మ జాతర పరిష్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల పెయింటింగ్ తో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ జాతరల్లు జనవరి మొదలుకొని మార్చి ఏప్రిల్ వరకు ప్రతిరోజు ఏదో గ్రామంలో జాతరలు నిర్వహిస్తూ ఉంటారు.

తెంటు సూర్యనారాయణ కుటుంబాన్ని

## పరామర్శించిన ఎమ్మెల్యే బేబీ నాయన



**బాడంగి, జనవరి 11 (మేజర్ న్యూస్) :** బాడంగి మాజీ జడ్పీటీసీ సభ్యులు, మాజీ ఏఎంసీ చైర్మన్ తెంటు సూర్యనారాయణ ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకుముందు అమరావతి ప్రయాణంలో ఉండటంతో అంత్యక్రియలకు హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యే, ఆదివారం బుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో కలిసి ముగడ న్యూ కాలనీలోని తెంటు సూర్యనారాయణ స్వగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెంటు సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భవిష్యత్తులో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, బెనర్జీ, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చోడమ్మ అగ్రహారంలో క్రికెట్ క్రీడా సంబరాలు

– పోటీలను ప్రారంభించిన మార్క్ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు



**పూసపాటిరేగ, జనవరి 11, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని చోడమగ్రహారం పంచాయతీలో తెదేపా నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ గొర్ల రమణ హార్దిక నిర్వహణలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మార్క్ఫెడ్ రాష్ట్ర చైర్మన్, నెల్లిమర్ల తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతో బంగారు రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన బంగార్రాజు మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో అవసరమని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, స్నేహభావం, నాయకత్వ లక్షణాలను పెంచుతాయని అన్నారు. సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగల సమయంలో గ్రామాల్లో క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఐక్యత మరింత బలపడుతుందని, యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ, విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసి, పాల్గొన్న అన్ని జట్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద్, స్థానిక నాయకులు గొర్లె రమణ, చందక ఆనంద్, గ,పిల్లా శ్రీరాములు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కష్టాలు తీరుతాయ్.. కన్నీరొద్దు

– బంగ్లా చెర నుండి మత్స్యకారులను విడిపించే బాధ్యత మాది – ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**భోగాపురం, జనవరి 12 (మేజర్ న్యూస్) :** బంగ్లాదేశ్ చెరలో చిక్కుకున్న మన మత్స్యకారులను త్వరలోనే మన దేశానికి తీసుకొచ్చే బాధ్యత మాపై ఉందని ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని ఎంఎస్ఎం ఈ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం భోగాపురం మండలం కొండరాజుపాలెం గ్రామంలో మత్స్యకారులకు ప్రభుత్వం నుండి వచ్చిన కుటుంబానికి రూ.30 వేలు చొప్పున 9 మందికి చెక్కుల రూపంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు చేతుల మీదుగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనవరి మొదటి వారంలోనే వారిని విడుదలకు అన్ని సిద్ధం చేసినప్పటికీ, ఆయా దేశంలో పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆలస్యం జరిగిందని, ఒకటి, రెండు నెలల్లో వారు వచ్చే విధంగా ఎప్పటికప్పుడు విదేశాంగ మంత్రితో చర్చలు జరుపుతున్నామని తెలియజేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మత్స్యకారులకు వచ్చిన కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి నిరంతరం అందుబాటులో ఉంటూ సహాయార్థ విషయంలో కూడా వెనుకంజ వేయడం లేదన్నారు. మార్క్ఫెడ్ చైర్మన్ బంగార్రాజు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఒక మంచి నిర్ణయం సంతోషించదగ్గ విషయమని, ఇటీవల కాలంలో నా వంతు సహాయం చేశానని, భవిష్యత్తులో వారి కష్ట పరిస్థితుల్లో నేను తోడై ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాట్ల కీర్తి, తాసిల్దార్లు రవణమ్మ, ఎన్.వి.రమణ, కూటమి నాయకులు మహంతి చిన్నంనాయుడు, వందనాల రమణ, మట్ట అయ్యప్పరెడ్డి, పల్లంట్ల జగదీష్, పడాల శ్రీనివాసరావు, ఆకిరి ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## సెంచూరియన్‌లో ముగిసిన అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలు




**నెల్లిమర్ల, జనవరి 11, మేజర్ న్యూస్ :** సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఈనెల 6 నుంచి నిర్వహిస్తున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్. రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని పొందాలని కోరారు. క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు సమకూర్చుతున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అంతర్జాతీయ క్రీడాకారులు బూర శ్యాంసుందర్ కోరారు ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత నాగిశెట్టి ఉష మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఉత్తేజం పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. భవిష్యత్తులో ఇదేస్ఫూర్తిని కొనసాగించాలని వారు కోరారు.

సెంచూరియం విశ్వవిద్యాలయాలు విజయనగరం, పర్లాకిమిడి, బాలాసోర్, చత్రపూర్, భువనేశ్వర్ మధ్య జరిగిన ఈ క్రీడా పోటీల్లో బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రో బాల్, ఫుట్ బాల్, ఖోఖో, కబడ్డీ వంటి వివిధ క్రీడా అంశాలలో 600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు సతీమణి పద్మ, భువనేశ్వర్ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.ఎన్. రౌత్రే, పర్లాకిమిడి స్పోర్ట్స్ అధికారి సయ్యద్ రిజి, విజయనగరం డిప్యూటీ రిజిస్ట్రార్ అండ్ స్పోర్ట్స్ అధికారి ఆసిఫ్, డీన్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, గ్రామ్ తరంగ్ టెక్ మేనేజింగ్ డైరెక్టర్ బాబు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్ కి నల్లిబాబు ఆర్థిక సాయం



**నెల్లిమర్ల, జనవరి 11, మేజర్ న్యూస్ :** మండలంలోని సతివాడ క్రీడాకారులకు క్రికెట్ కిట్ కొనుగోలుకు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఆల్తి నల్లిబాబు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు ఈ మొత్తాన్ని నల్లి బాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. క్రీడల్లో నైపుణ్యం సాధించిన యువతకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా గ్రామానికి, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు పెంచాలని నల్లి బాబు సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మత్స్యకారుడి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

**- మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**



**కోటబొమ్మాళి, జనవరి 11, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం డి. మరువాడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు రామారావు సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మత్స్యశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్న మంత్రి, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా మత్స్యకారులకు తగిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# యువతలో క్రీడా స్ఫూర్తి అవసరం

**- ఆమదాలవలసలో సంక్రాంతి సంబరాల క్రికెట్ పోటీలు ప్రారంభం - పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కూన రవికుమార్**



**ఆమదాలవలస, జనవరి 11, మేజర్‌న్యూస్:** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతను కల్పిస్తుందని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఏపిఎల్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ, క్రికెట్ బ్యాట్ పట్టుకొని కాసేపు క్రికెట్ ఆడారు. యువతను ఉత్సాహ పరుస్తూ క్రికెట్ ఆడడంతో అందరూ సంబరపడ్డారు. ఇటువంటి క్రీడలు నిర్వహించుకోవడం వలన యువత స్నేహపూర్వకంగా మెలిగేందుకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడారంగం సిక్కోలు జిల్లాకు పుట్టినిల్లు వంటిదని, జిల్లా నుంచి ఎంతోమంది క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో రాణించి గుర్తింపు పొందారని తెలిపారు. ఆమదాలవలస పట్టణంలో ఉన్న క్రీడా మైదానం ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్ది ఉన్నత స్థాయిలో అవకాశాలు అందించిందని గుర్తు చేశారు. సంక్రాంతిలో ఇటువంటి క్రీడలను నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. క్రీడల్లో గెలుపు, ఓటమి సమానంగా క్రీడాకారులు భావించి, నేటి వాటమి రేపటి గెలుపుకు పునాదిగా మార్చుకోవాలి సూచించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు రావాలని సూచించారు. క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉద్యోగ అవకాశాలు పొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ పర్సన్ తమ్మినేని గీత, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నూక రాజు, క్రికెట్ పోటీల నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, సనపల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## హద్దు మీరి మాట్లాడితే సహించేది లేదు

**- ప్రతిపక్షానికి తెదేపా నాయకులు హెచ్చరిక**



**పలాస, జనవరి 11, మేజర్‌న్యూస్:** నిరాధార ఆరోపణలతో హద్దు మీరి మాట్లాడితే ఇకపై సహించేది లేదని ప్రతిపక్ష నాయకులపై స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పలాస లో గల తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు అగ్గిమీద గుగ్గిలమయ్యారు.కేవలం రాజకీయ లబ్ధి కోసం,అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వంపై బురద చల్లే నీచ రాజకీయాలను ఇకపై ఉపేక్షించేది లేదని వారు తీవ్ర స్వరంతో హెచ్చరించారు."మీరు చెప్పే అబద్ధాలకు,చేసే నాటకాలకు కాలం చెల్లింది. దమ్ముంటే ఆధారాలతో ప్రజాక్షేత్రంలోకి రండి, తేల్చుకుందాం"అని ప్రతిపక్షానికి బహిరంగంగా సవాలు విసిరారు.

**- మీది పాత చింతకాయ పచ్చడి.. మాది వేగవంతమైన చర్య**

జగన్నాథ సాగరం వద్ద భూ ఆక్రమణ జరిగిందంటూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేస్తున్న ఆరోపణలు,ఆయన రాజకీయ దివాలాకోరుతనానికి నిలువుటద్దం అని టీడీపీ నాయకులు ఎద్దేవా చేశారు."మీరు నిద్రలేచి పత్రికల ముందుకు రావడానికి ముందే, ఆక్రమణ వ్యవహారం మా ఎమ్మెల్యే దృష్టికి వచ్చిందని,వెంటనే అధికారులతో చర్యలకు ఉపక్రమించామని అన్నారు.మీరు కట్టుకథలు అల్లుతున్న సమయంలోనే,జనవరి 9వ తేదీన సంబంధిత వ్యక్తులపై నేరారోపణలతో కూడిన ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదైంది.చట్టం తన పని తాను చేసుకుపోతుంటే,ఇప్పుడు మా ఎమ్మెల్యే గౌతు శిరీష పై,ఆమె కుటుంబంపై నిందలు వేయడం మీ దిగజారుడుతనానికి పరాకాష్ట అని వారు తీవ్రంగా విమర్శించారు.

**- ఐదేళ్ల మీ పాలనలో రూ.1500 కోట్ల అవినీతి సంగతేంటి?**

గత ఐదేళ్ల మీ చీకటి పాలనలో పలాసలో మీరు మింగేసిన కొండలు,చేసిన అవినీతి పలాస ప్రాంత ప్రజలు ఇంకా మర్చిపోలేదన్న విషయం గుర్తుంచుకోండి అని నాయకులు ఘాటుగా హెచ్చరించారు. అధికారంలో ఉండగా ప్రజా దర్బార్‌లో ఆధారాలతో సహా మేము ఫిర్యాదు చేస్తే, కనీసం స్పందించని మీరు, ఈరోజు నీతులు చెప్పడం హాస్యాస్పదం అని అన్నారు.కేవలం 18 నెలల కాలంలోనే మా ఎమ్మెల్యే శిరీష అవినీతి రహిత పాలన అందిస్తుండటంతో మీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి అని,ఆ అసూయతోనే ఈ తప్పుడు ప్రచారానికి తెరలేపారు అని వారు దుయ్యబట్టారు.

**- దమ్ముంటే నిరూపించండి.. లేదా నోరు మూసుకోండి**

ఆక్రమణల విషయంలో తమ చిత్తశుద్ధిని చాటుతూ,టీడీపీ నాయకులు ప్రతిపక్షానికి మునుపెన్నడూ లేని విధంగా సవాల్ విసిరారు.పదండి,మీరు చెప్పిన ఏ చెరువు,ఏ కొండ దగ్గరికి అయినా మేము వస్తాం.ఒక్క అంగుళం భూమి ఆక్రమణకు గురైందని మీరు నిరూపిస్తే మేమే స్వయంగా దగ్గరుండి తొలగిస్తాం.కానీ మీ ఆరోపణలు అబద్ధమని తేలితే పలాస ప్రజల ముందు ముక్కును నేలకు రాసి క్షమాపణ చెప్పే దమ్ము మీకుందా అని వారు నిలదీశారు.నల్లబొడ్లూరు కొండ విషయంలో కోర్టు విధించిన రూ.3 కోట్ల జరిమానా నుండి తప్పించుకోవడానికి, న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నది మీరని,మరో వైపు ప్రజా శ్రేయస్సు కోసం కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి అప్పగించి త్యాగానికి సిద్ధపడింది మేమని వారు స్పష్టం చేశారు.ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మానుకొని,ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని వారు హితవు పలికారు.ప్రజలు విజ్ఞులు మీ నాటకాలను వారు గమనిస్తున్నారు.ఇదే తీరు కొనసాగితే,ప్రజాగ్రహానికి గురికాక తప్పదని,ఇది మా తుది హెచ్చరిక అని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**: జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడి**



**శ్రీకాకుళం, జనవరి 11, మేజర్ న్యూస్:** నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ లో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా పై కార్యక్రమములో లేదా ఆన్లైన్ లో(మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సూర్య పత్రిక కేలండర్ ఆవిష్కరించిన జ్యోతి హాస్పిటల్ అధినేత

**: రాజశేఖర్ సిగిలిపెల్లి**



**టెక్కలి, జనవరి 11, మేజర్‌న్యూస్:** సూర్య పత్రిక క్యాలెండర్ ను జ్యోతి హాస్పిటల్ అధినేత రాజశేఖర్ సిగిలిపెల్లి ఆదివారం టెక్కలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రతినిధి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి వేల పరిసరాలు



**రణస్థలం, జనవరి 10, మేజర్‌న్యూస్:** రణస్థలం మండలం రణస్థలం పంచాయతీ, నగరపాలెం గ్రామంలో రానున్న సంక్రాంతి పండుగ దృష్టియా వివిధ ప్రాంతాల నుంచి పంచాయతీకి బంధువులు వస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే దృష్టితో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు మరియు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు పంచాయతీలో ప్రతి గ్రామము, ప్రతి వీధి పారిశుద్ధ్యంగా ఉండాలని, మురికి కుంటలు, చెత్త పోగులు ఎక్కడ పడితే అక్కడ వేయరాదని దినికి పంచాయతీలో గల ప్రజలందరూ సహకరించాలని కోరారు.

## జాతర శిల్పారామంలో సంక్రాశీతి సంబరాలు

### ఆకట్టుకున్న చిన్నారుల జానపద నృత్యాలు



**మధురవాడ, జనవరి 11, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం, మధురవాడ జాతర శిల్పారామంలో సంక్రాశీతి సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం నృత్య భారతి డాన్స్ అకాడమీ చిన్నారులచే కూచిపూడి, మరియు జానపద నృత్యములు ప్రదర్శించారు. చిన్నారులు చేసిన కూచిపూడి, మరియు జానపద నృత్యములు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో శుక్లం భరధరఓ,కృష్ణా శాంగ్, గోవర్ధన గిరి,సీత కళ్యణశీ, అష్ట లక్ష్మి,ప్రాణావాలయం, నెమలికనార్పిన నడకలివి,ఓంశారవాణి, కోఈలారే, గీతాలకు చిన్నారులు నృత్య ప్రదర్శన చేసారు. ఈ నృత్య ప్రదర్శనలో లేకిత, చంద్రిక,దేవిశ్రీ, భవ్య శ్రీ, శ్రీలక్ష్మి,లాస్య ప్రియా, ఖుషి, నమ్రత,సౌమ్య, పాల్గొన్నారు. ఈ గీతాలకు మౌనిక నృత్య దర్శకత్వం వహించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా సోమవారం సరస్వతి నృత్య కళానికితన్ వారి శాస్త్రీయ మరియు జానపద నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు.

## నేడు జివిఎంసిలో పీజీఆర్ఎస్

### పది జోన్లులో పిజిఆర్ఎస్ కార్యక్రమం

### -జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, జనవరి 11, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" నేటి ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్టు జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ ఒక ప్రకటనలో తెలిపారు.నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

## పి భీమవరం వీఆర్వో శంకర్రావుకు ఘన సత్కారం



**బుచ్చయ్యపేట, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలో పి.భీమవరం గ్రామ వీఆర్వో పోతల శంకర్రావు ను వీఆర్వో ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పి భీమవరం సర్పంచ్ రాము నాయుడు వీఆర్వో శంకరరావు ను ఘనంగా సత్కరించారు. అలాగే కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, కొండేపూడి సర్పంచ్ ఆది సత్యనారాయణ మరియు పలు గ్రామాల సర్పంచులు వీఆర్వో శంకర్రావు ను సాలవాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# గుడిలోవ విజ్ఞాన విహార 40వ వార్షికోత్సవం

## అబ్బురపరచిన పిల్లల విన్యాసాలు

ఆనందపురం జనవరి 11 మేజర్ న్యూస్

విజ్ఞన విహార పాఠశాలలో పిల్లల సన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి బాలురుతో పాటు బాలికలు కూడా సాహస మైన విన్యాసాలు చెయ్యడం ఇక్కడ ప్రత్యేకత, 60 నిమిసాలు జరిగిన ప్రదర్శనలో బైకుతో విద్యార్థులు చేసిన విన్యాసాలు కళ్ళు గగుర్పాటు కలిగించాయి. స్కూల్ లో 11 వ తరగతి చదువుతున్న పురుషోత్తం, వేణు, సిద్దు చరణ్ హర్షవర్ధన్ తదితరులు బైక్ పై నుంచి చేసిన విన్యాసాలు అందరాని ఆశ్చర్యపరిచాయి, నిప్పు చక్రంలోనుంచి దూకడం, చుపులైటలనుండి దూసుకొనివెలడం, బైకుతో గాలిలో ఎగురుతూ చేసిన విన్యాసాలు, వారి ధైర్యసాహసాలు నిందర్శనగా నిలిచాయి. గుడి లోవ విజ్ఞాన విహార విద్యార్థులకు ఎంతటి శారీక శిక్షణ ఉంటుందో విద్యార్థులు అవలీలగా పై చేసిన మోటార్ బైక్ విన్యాసాలు ఉదాహణగా నిలిచాయి, మల్ల కంబ పై విద్యార్థులు చైతన్య, చరణ్ తేజ, జ్ఞానేశ్వర్, హర్ష రామ్, రోహిత్ కృష్ణ కాంత్, సద్గణాకర్ నాయుడు తదితర విద్యార్థులు శరీరాన్ని రబ్బర్ ట్యూబ్ లాగా తిప్పుతూ చేసిని విన్యాసాలు చూపరులను గగుర్పాటు కలిగించాయి.భారత్ సైన్యములో సైనికులు చేసే మల్ల కంబ విన్యాసాలకు మించి, గుడిలోనే విద్యార్థులు తమ ప్రతిభంను నిరూపించారు, అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా వారి సహ విన్యాసాలు తీసి పోలేదు బాలికలు అవంతిక మహతో, సాయి గీత, పవిత్, వెన్నెల, నిత్యా లక్ష్మి, షర్మిల తదితరులు తొడును పట్టుకొని 40 మీటర్ల ఎత్తు మీదకి ప్రాకడం తాడుమీద న మోటార్ బైకులు పై విద్యార్థులు చేసిన విన్యాసాలు వారిలో ఎంతటి బాలన్స్ ఉందో నిరూపించారు, విద్యార్థులు వేణు, సిద్దు విద్యార్థులు మోటార్



బైక్ నడుపుతూ నలుగురు బండి మీద ఎక్కించి చేసిన ప్రదర్శనలు విద్యార్థులు పెద్ద పిరమిడ్స్ నిర్మాణం, యోగాసనం ప్రదర్శన, సామూహిక డ్రిల్ల్ విజ్ఞాన విహార విద్యార్థుల క్రమ శిక్షణ మారు పేరులా నిలిచాయి. మధ్యలో మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా అబ్బాయిలు ప్రదర్శచిన చక్క భజనలు, అమ్మాయిలు ప్రదర్శించిన కోలాటం హైలైట్ గా నిలిచాయి.కను రెప్ప పాటులో మారిపోయే విధంగా 60 నిముషాలలో 63 ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించి చదువుతో పాటు అన్ని రంగములలో మేము ఉన్నామని నిరూపించారు. విద్యార్థుల శారీరక విన్యాసాలను ఒరిస్సా ప్రభుత్వం సి జి ఎస్ టి జాయింట్ కమీషనర్ డి. కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విద్యా భారతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కన్నా భాస్కర్, అల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ దూసి రామ కృష్ణ విజ్ఞాన విహార చైర్మన్ పి.వీ నారాయణ రావు పాల్గొన్నారు.

# టీ ఈ డి కి ఆతిథ్యం ఇస్తున్న ఐ ఐ ఏం విశాఖపట్నం

**విశాఖఎడ్యుకేషన్, జనవరి 11, మేజర్‌న్యూస్:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఐ ఐ ఏం వి క్యాంపస్ ఆడిటోరియంలో ఆదివారం టెడ్స్ ని నిర్వహించింది, 'రిఫ్రాక్టెడ్ రియాలిటీస్ణ అనే థీమ్ కింద మేధోపరంగా ఆకర్షణీయమైన కార్యక్రమం కోసం విభిన్న వృత్తిపరమైన నేపథ్యల నుండి విశిష్ట వక్తలను ఒకచోట చేర్చింది. టెడ్ స్ఫూర్తితో రూపొందించబడిన ఒక అట్టడుగు స్థాయి చొరవ. 1984లో స్థాపించబడిన టెడ్ అనేది "వ్యాప్తి చెందడానికి విలువైన ఆలోచనలను" కనుగొని వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులతో విద్యా మరియు స్ఫూర్తిదాయకమైన ఆలోచనలను పరిశోధించడానికి మరియు పంచుకోవడానికి అంకితమైన లాభాపేక్షలేని సంస్థ.ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక నికితాగా ప్రసిద్ధి చెందిన శ్రీమతి నికితా త్యాగి, సమకాలీన సందర్భాలలో ప్రాచీన భారతీయ తత్వశాస్త్రాన్ని ప్రదర్శించడంలో ప్రసిద్ధి చెందారు. భారతదేశంలోని ప్రముఖ ఫుట్‌బాల్ నర్సరీ అయిన మినర్వా అకాడమీ వ్యవస్థాపకుడు మూడుసార్లు ప్రపంచ రికార్డును కలిగి ఉన్న రంజిత్ బజాజ్ వక్తలలో ఉన్నారు. స్పీకర్ల శ్రేణిలో అనుభవజ్ఞుడైన ఆర్మీ అధికారి, ఫిట్ ఇండియా రాయబారి, ఎలైట్ అథ్లెట్ వ్యవస్థాపకుడు కెప్టెన్ ధర్మవీర్ సింగ్ కూడా ఉన్నారు. రికార్డు బద్దలు కొట్టిన పర్వతారోహకురాలు, సర్టిఫైడ్ స్కూబా డైవర్ మరియు పారాగ్లైడర్ ప్రకృతి వర్ష్ణి కూడా సభను ఉద్దేశించి ప్రసంగించారు. కార్పొరేట్ రంగం నుండి, హనీవెల్ ఇండియా అధ్యక్షుడు ఏ ఏం సి ఏచ్ ఏ ఏం ఇండియా నేషనల్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు ఆశిష్ మోడీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ కంటెంట్ సృష్టికర్త మరియు ది చిల్ అవర్ పాడ్‌కాస్ట్ హోస్ట్, ఇంపాక్ట్ 30 అండర్ 30 గౌరవ విజేత మరియు మాజీ డివిజన్ స్థాయి క్రికెటర్ దీపక్ పరీక్ కూడా వక్తలలో ఉన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు అతిథుల నుండి చురుకైన భాగస్వామ్యం కనిపించింది. తరగతి గదికి మించి జ్ఞాన మార్పిడి, విభిన్న దృక్పథలు మరియు సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించే వేదికలను పెంపొందించడంలో ఐ ఐ ఏం విశాఖపట్నం యొక్క నిబద్ధతను ఈ కార్యక్రమం పునరుద్ఘాటించింది.

# భోగాపురం వాలిడేషన్ ఫ్లైట్ ప్రభావం

## గ్రోత్ కారిడార్‌లో భూమి ధరలు

## 20-30% పెరుగుదల అంచనా

**విశాఖపట్నం, జనవరి 11, మేజర్‌న్యూస్:** త్వరలో ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఇటీవల నిర్వహించిన వాలిడేషన్ ఫ్లైట్‌తో విశాఖ--విజయనగరం గ్రోత్ కారిడార్‌లో భూముల మార్కెట్ మళ్లీ ఊపందుకున్నట్టు రియల్ ఎస్టేట్ వర్గాలు పేర్కొంటున్నాయి. విమానాశ్రయం పరిసర కీలక ప్రాంతాల్లో భూమి ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగినట్టు మార్కెట్ వర్గాలు, రియల్ ఎస్టేట్ స్టేక్‌హోల్డర్లు అంచనా వేస్తున్నారు.ఈ కారిడార్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న డీలర్లు, డెవలపర్లు మాట్లాడుతూ-వాలిడేషన్ ఫ్లైట్‌తో మార్కెట్లో నమ్మకం పెరిగిందని, పెట్టుబడిదారుల ఆసక్తి తిరిగి పెరగడంతో ఎన్‌క్వైరీలు పెరిగాయని, డీల్స్ కూడా త్వరగా ముగుస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా భోగాపురానికి నేరుగా కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో డిమాండ్ స్పష్టంగా పెరిగినట్టు చెప్పారు. భోగాపురం, నెల్లిమర్ల, కొత్తవలస, తగరాపువలస, ఆనందాపురం ప్రాంతాలతో పాటు భీమిలి బెల్ట్‌లోని కొన్ని ప్రాంతాల్లో డిమాండ్ పెరిగినట్టు సమాచారం. విశాఖ విస్తరణ కారిడార్‌కు సమీపంగా ఉన్న ప్రధాన మార్గాల వెంట కూడా ధరలు పెరిగినట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కొనుగోలుదారులు ప్రధానంగా అప్రోచ్ రోడ్లు, ఇప్పటికే ఉన్న హైవేలు, ప్రతిపాదిత ఇన్‌ఫ్రా కారిడార్ల పరిధిలోని భూములను ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నట్టు మార్కెట్ మధ్యవర్తులు తెలిపారు. "ఇంతకుముందు ఆసక్తి ఉన్నప్పటికీ కొనుగోలుదారులు కొంత జాగ్రత్తగా వ్యవహరించేవారు. వాలిడేషన్ ఫ్లైట్ తర్వాత వఅనబఱఅతీఱవం బాగా పెరిగాయి. లావాదేవీలు కూడా వేగంగా జరుగుతున్నాయి" అని క్రెడాయ్ విశాఖ చాప్టర్ అధ్యక్షుడు ఈ. అశోక్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు ప్రధానంగా దీర్ఘకాలిక



పెట్టుబడిదారులే కొనుగోళ్లకు ముందుకొచ్చే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ప్లాటెడ్ హౌసింగ్ కోసం పెద్ద విస్తీర్ణాల భూములపై డెవలపర్లు కూడా ఆసక్తి చూపుతున్నారని ఆయన వివరించారు. జోనింగ్ నిబంధనలు, అధికారిక అనుమతులకు లోబడి వాణిజ్య వినియోగానికి మార్చగల భూములపై కూడా డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో గత కొన్ని వారాలుగా ధరలు వేగంగా పెరగడంతో కొనుగోలుదారులు క్లియర్ టైటిల్ ఉన్న భూములు, ఆధికారికంగా అప్రూవ్ అయిన లేఅవుట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రాపర్టీ కన్సల్టెంట్లు చెబుతున్నారు. అనుమతిలేని వెంచర్లకు దూరంగా ఉండాలని, కొనుగోలు ముందు తప్పనిసరిగా డాక్యుమెంట్లను పరిశీలించాలని నిపుణులు సూచించారు. ముఖ్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రోత్ కారిడార్‌లలో నిబంధనల అనుసరణ కీలకమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విమానాశ్రయం నిర్మాణం, అనుబంధ మౌలిక సదుపాయాల పనులు పురోగతిలో ఉండటంతో భోగాపురం--విశాఖ కీలక కనెక్టివిటీ మార్గాల వెంట డిమాండ్ నిలకడగా కొనసాగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**– అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తెలుసుకోవాలి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్**



**అనకాపల్లి ప్రతినిధి, జనవరి 11, మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని (పి జి ఆర్ ఎస్) నేడు సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ తో పాటు జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పి జి ఆర్ ఎస్ కు హాజరు కాని అర్జీదారులు (మీ కోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ సూచించారు.

## రాజముద్ర పాసు పుస్తకాలకే పరిమితం...

**– రైతుల సమస్యలు ఎక్కడివి అక్కడే**

**– సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు**



**బుచ్చయ్యపేట, జనవరి 11, మేజర్‌న్యూస్:** రైతుల భూమి హక్కులకు ఆధారమైన పాసు పుస్తకాలలో రూపం మారినప్పటికీ, అసలు సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని రైతులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్, భూమి విస్తీర్ణం, రైతు పేరు, రెవెన్యూ గ్రామం, రైతు ఫోటో వంటి కీలక వివరాల్లో అనేక లోపాలు కొనసాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైతు పాస్ పుస్తకాలపై వైఎస్ జగన్ ఫోటో ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాస్ పుస్తకాలలో ఉన్న తప్పులను సవరించి రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు ముద్రిస్తామని హామీ ఇచ్చిందని ఆకుల నాగేశ్వరరావు గుర్తు చేశారు. అయితే ఆ హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదని ఆయన ఆరోపించారు. పాస్ పుస్తకాలలో తప్పుల కారణంగా రైతులు బ్యాంకుల వద్ద రుణాలు పొందడంలో, పంట రుణ మాఫీ, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరు రైతుల భూమి వివరాలు ఇతరుల పేర్లతో నమోదవడం, విస్తీర్ణంలో తేడాలు ఉండడం వల్ల అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ లోపాలను సరిచేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నప్పటికీ, రైతులు మాత్రం పూర్తిస్థాయిలో డేటా శుద్ధి చేసి తప్పులేని పాసు పుస్తకాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. పాస్ పుస్తకాల రూపం మార్చడమే కాకుండా, భూమి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, స్పష్టమైన కార్యాచరణ రూపొందించి పాసు పుస్తకాల లోపాలను సవరించాలని పలువురు రైతు నాయకులు కోరుతున్నారు.

# 24 వ వార్డులో విద్యుత్ సమస్య పరిష్కారం

**– స్పీకర్ అయ్యన్న కు కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిలర్ మధు**



**నర్సీపట్నం రూరల్, జనవరి 11, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం మున్సిపాలిటీలోని 24 వ వార్డు ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు ఆదివారం పరిష్కారం లభించింది. వార్డులో తరచూ విద్యుత్ అంతరాయం వస్తుండడంతో ఈ సమస్యను వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే సమస్యను పరిష్కరించమని స్పీకర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్పందించిన విద్యుత్ అధికారులు ఆదివారం హుటాహుటిన వార్డులో కొత్త విద్యుత్ స్తంభాలు వేసి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ సమస్య పరిష్కారంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు స్పీకర్ అయ్యన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**– గ్రామాల్లో కోడిపందెం, పేకాట, గుండ్లాటలపై నిషేదం, నిర్వహించిన వారి పై కఠిన చర్యలు – పండుగలకు స్టేజీ అనుమతులు తప్పనిసరి – దూర ప్రాంతాల క్యాంపులకు వెళ్లేవారు సమాచారం ఇవ్వండి – పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తాం – రూరల్ సీఐ అశోక్ కుమార్**




**అనకాపల్లి, జనవరి 11, మేజర్‌న్యూస్:** సకుటుంబ సపరివార సమేతంగా, ఉల్లాసంగా కుటుంబ సభ్యులతో ఈ సంక్రాంతి పండుగను అనకాపల్లి రూరల్ ప్రాంత ప్రజలు నిర్వహించుకోవాలని అనకాపల్లి రూరల్ సీఐ జీ.అశోక్ కుమార్ కోరారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పటికే సందడి వాతావరణం కన్పిస్తుందని, ఎక్కడెక్కడో స్థిరపడి సంక్రాంతి సందర్భంగా సొంత ఊరును, కుటుంబ సభ్యులను కలిసేందుకు సుదూర ప్రాంతాల నుంచి బంధువులు వస్తుంటారని అన్నారు. పండుగలను, సాంప్రదాయాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, సబ్ డివిజనల్ డీఎస్పీ ఎం. శ్రావణి ఆదేశాల మేరకు గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేశామన్నారు. ప్రజలందరూ పండుగను సుఖసంతోషాలతో చేసుకోవాలని, ఎటువంటి ప్రమాదాలు, అల్లర్లు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ముందుగా కోడిపందాలు, పేకాట, గుండ్లాటలకు దూరంగా ఉండాలని, బహిరంగ మద్యం, తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాలలో స్టేజీ ప్రోగ్రాంలు నిర్వహించే నిర్వాహకులు సబ్ డివిజనల్ డీఎస్పీ కార్యాలయం నుంచి అనుమతులు పొందాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇరుగుపొరుగు, కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారమిస్తే ఎల్ హెచ్ఎంఎస్( లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్)ద్వారా గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. మీ విలువైన వస్తువులను జాగ్రత్త చేసుకోవాలని, పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ జి.రవికుమార్, అడిషనల్ ఎస్ఐ నాగేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాలంపల్లి పంచాయతీలోజనసేన ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు

**– ముఖ్య అతిథులు బందారు సత్యనారాయణమూర్తి పంచకర్ల రమేష్ బాబులి**



**విమాడుగుల, జనవరి 11, మేజర్‌న్యూస్:** మాడుగుల మండలంలో జాలం పల్లి పంచాయతీలో జనసేన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులు శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి శాసనసభ్యులు ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు రమేష్ బాబు మాట్లాడుతూ మన శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల నియోజవర్గంలో మన జనసేన కార్యకర్తలను కలుపుకు పోతూ మనకు ఏ ఇబ్బంది వచ్చినా నేనున్నానంటూ మన కార్యకర్తలకు భరోసా ఇస్తూఏ లోటు రాకుండా చూసుకున్నందుకు బండారు సత్యనారాయణమూర్తి అన్నకు ముఖ్యంగా ధన్యవాదాలు తెలుపుతూ స్థానిక సంస్థల ఎలక్షన్ లో మన అందరం కూటమి ప్రభుత్వం ఏ అభ్యర్థిని నిలబెట్టిన కష్టపడి పనిచేయాలని జనసైనికులకు సూచించారు అనంతరం బండారు సత్యనారాయణ మూర్తి కు పంచకర్ల రమేష్ బాబుకు మండల జనసైనికు లు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం మండల జనసేన పార్టీ అధ్యక్షులు గట్రెడ్డి శివాజీ ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు మండల నాయకులు ఆధ్వర్యంలో జాలంపల్లి పంచాయతీ జన సైనికులు ఎంతో కష్టపడి ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజవర్గ జనసేన ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ చోడవరం నియోజవర్గం జనసేన ఇంచార్జ్ పి వి ఎస్ ఎన్ రాజు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు నియోజకవర్గ జనసేన నాయకులు ముర్రు ఈశ్వరరావు దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షులు రామ్మూర్తి నాయుడు చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు జీవీ మూర్తి త్రినాథ్ సీనియర్ నాయకులు గుమ్మడి శ్రీరామ్ చోడవరం మాడుగుల జనసేన ముఖ్య నాయకులు జనసేన మండల పార్టీ నాయకులు కార్యకర్తలు జాలంపల్లి జనసేన గ్రామ పంచాయతీ అధ్యక్షులు గుమ్మడి అప్పారావు పెదేరు ఆర్ఎంసి వన్ చైర్మన్ పల్లా శ్రీనివాసరావు టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు బాణం భీమున్నదొర మార్కెటింగ్ డైరెక్టర్ కోఆపరేటివ్ చైర్ పర్సన్స్ రెండు నియోజకవర్గాల జనసైనికులు వీర మహిళలు టిడిపి జనసేన బిజెపి కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## హిందీ మంచ్ క్యాలెండర్, స్టిక్కర్ల ఆవిష్కరణ



**పాలకొండ, మేజర్ న్యూస్ :** హిందీ భాషాభిమానుల వేదిక " హిందీ మంచ్ " సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్లను ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు సి.ఎల్.నాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక నాయుడు విద్యాసంస్థల భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి కృషి చేసేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. హిందీ మంచ్ వ్యవస్థాపకులు కోనే శ్రీధర్ మాట్లాడుతూ, హిందీ భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. హిందీ ప్రచార సభ కన్వీనర్, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు చొంగ శివానంద్ మాట్లాడుతూ, మన్యం జిల్లాలో జాతీయ భాష హిందీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# రాష్ట్ర పండుగ రథసప్తమి వేడుకలు



**పార్వతీపురం, జనవరి 11, మేజర్ న్యూస్ :** స్థానిక సుర్య పీఠంలో మాఘ హేలా శ్రీ సూర్యవైభవముల కరపత్ర ఆవిష్కరణ పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్ర చేశారు. ప్రాంగణంలో జరగనున్న కళ్యాణోత్సవములు, సహస్ర దీపాలంకార సెవ, సహస్ర కలశాభిషెకము, ఊంజల్ పూలంగి సేవల, భక్తుల దర్శనముల వివరములు సూర్యపీఠ నిర్వాహకులు అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి తెలియజేశారు. మన్యం జిల్లాకు ప్రముఖ సూర్య క్షేత్రంగా విరాజిల్లుతూ అనేక యజ్ఞయాగాది క్రతువులు మూడు దశాబ్దాలకు పైగా చేస్తున్నందకు శ్రీ శాస్త్రిని అభినందించారు. అనంతరం విజయచంద్ర మాట్లాడుతూ భవిష్యత్తులో పార్వతీపురానికి మంచి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా రథసప్తమి రాష్ట్ర పండుగగా ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిటం చాలా సంతోషకరమని అందుకు తగిన రీతిలో ఉత్సవ నిర్వహణ జరగాలని నిర్వహణ కమిటీని కోరుతూ తన వంతు సహాయం చెస్తానని అన్నారు. మన్యం జిల్లా ఆరామ ద్రావిడ సంఘ ప్రతినిధులు రంప వేంకటప్రభాకర శర్మ, రెజేటి శ్రీనివాస శర్మ, పులఖండం ప్రసాద్ శర్మ, సర్వాజోశ్యుల విద్యాప్రదీప్ శర్మ, బంకుపల్లి సుబ్రహ్మణ్య శర్మ, పులఖండం గణపతి శాస్త్రి, బంకుపల్లి ప్రశాంత్ శర్మ వేదమంత్ర పఠనం చెశారు. అనంతరం రథసప్తమి భక్తులకు త్రాగునీరు, క్యూలైను ఏర్పాట్లు , ప్రసాద వితరణ విషయాలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పడిన ఉత్సవ నిర్వహణ కమిటీకి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమములో బెలగాం జయప్రకాష్ నారాయణ, నంగిరెడ్డి మధుసూదన రావు, పొట్నూరు వెంకటనాయుడు, దేవకోటి వెంకటనాయుడు, పల్లి రామారావు, కలింగ ఉమామహేశ్వరరావు, గుంట్రెడ్డి రవికుమార్, బార్నాల సీతారాం, యజ్జుపురపు సంతోష్, సాదు సత్యనారాయణ, డా.జి.భానుప్రసాద్, డాపెంట అప్పారావు పాల్గొన్నారు.

# ఏ.వెంకంపేటలో ఉత్తరాంధ్ర జిల్లాల వాలీబాల్ పోటీలు

- పోటీల్లో పాల్గొన్న 52 జట్లు క్రీడాకారులు - మంత్రి గుమ్మడి సంధ్యారాణి తండ్రి జ్ఞాపకార్థంగా

- మండల పార్టీ అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాల నా స్వగ్రామంలో నిర్వహణ - మొదట బహుమతి విజేతగా వీరఘట్ట టీం

- విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు నగదు పురస్కారాలు - 13వ తేదీన ఎడ్ల పందాలకు హాజరుకానన్న రాజకీయ ప్రముఖులు



**మక్కువ, జనవరి 11 (మేజర్ న్యూస్) :** పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలం ఎ.వెంకంపేట గ్రామంలో ఉత్తరాంధ్ర జిల్లాల వాలీబాల్ పోటీలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తండ్రి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జన్ని ముత్యాలు జ్ఞాపకార్థంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు తమ స్వగ్రామమైన ఏ వెంకంపేట లో ఆటల పోటీలు నిర్వహించడం విశేషం.! గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని తమ అభిమాన నాయకురాలుపై గల తమ అభిమానాన్ని చాటుకుంటూ, ఉత్తరాంధ్ర జిల్లాల ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. గత మూడు రోజులుగా నిర్వహించిన ఆటల పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుండి సుమారు 52 జట్లు క్రీడాకారులు పాల్గొని పోటా పోటీగా పాల్గొన్నారు. సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ , మక్కువ ఎస్ఐ , ఎం వెంకటరమణ క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను మరింత ఉత్తేజ పరచడంతో క్రీడా కారుల్లో మరింత ఉత్తేజం నింపింది. క్రీడాకారులకు కావలసిన భోజన వసతి సౌకర్యాలు మండల పార్టీ అధ్యక్షులు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో వీర ఘట్టానికి చెందిన క్రీడాకారులు మొదటి బహుమతి గెలుపొందగా, రెండవ బహుమతి మక్కువ మండలం ఊటగడ్డ గ్రామానికి చెందిన క్రీడాకారులు కైవశం చేసుకున్నారు. మూడవ బహుమతి బొబ్బిలి మండలం గున్న తోటవలస గ్రామానికి చెందిన క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. విజేతలైన క్రీడాకారులకు ముందు ప్రకటించిన విధంగా నగదు పురస్కారంతోపాటు జ్ఞాపికలు నేడు అనగా సోమవారం నాడు మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా అందజేయనున్నట్టు మండల పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలనాయుడు తెలిపారు. అలాగే 13వ తేదీన నిర్వహించిన ఎడ్ల పందాలకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తో పాటు రాజకీయ ప్రముఖులు ఉన్నట్టు ఆయన సందర్భంగా తెలిపారు.







### క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో

## ఉన్నత శిఖరాలను అధిగమించాలి

### - తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు యుగంధర్





**పాచిపెంట, జనవరి 11, మేజర్ న్యూస్ :** క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిగమించాలని, క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని పాచిపెంట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గూడెపు యుగంధర్ పిలిపునిచ్చారు. మండల కేంద్రమైన పాచిపెంట గ్రామంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణ వద్ద మెగా క్రికెట్ టోర్నమెంటు దుగ్గివలస ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో క్రికెట్ టోర్నమెంట్‌ను యూత్ లీడర్ పాచిపెంట సంతోష్ కుమార్, డి.ప్రదీప్ కుమార్, కొండంగి చిరంజీవి రావు తదితరుల సమక్షంలో జరుగుతోంది. ఈ క్రికెట్ టోర్నమెంటులో 30 టీములు పాల్గొన్నాయి. రోజుకి ఆరు టీంలో ఆటలు ఆడుతున్నాయి. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యుగంధర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఐక్యమత్యంగా ఉండాలని ప్రస్తుతం యువత అన్ని రంగాల్లో నైపుణ్యం సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఆటలతో ఐక్యమత్యం ఏర్పడుతుందని, సమాజ సేవ చేయడానికి మంచి మనసు ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా మానసిక ఉల్లాసం శరీర దారూఢ్యం ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన యువకుల సందడి పాచి పెంట లో నెలకొంది. యువకుల కేరింతల మధ్య క్రికెట్ టోర్నమెంటు సందడిగా సాగింది. మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండశీగి చిరంజీవి రావు యువత ప్రోత్సాహం నిమిత్తం సుమారుగా 40,000 రూపాయలు వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. రాజకీయాలకతీతంగా ఈ టోర్నమెంట్ సాగడము గమనార్హం. ఈక్రీడా కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మతల బలరాం, పార్టీ వైస్ ప్రెసిడెంట్ పోలినాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి నర్సింగరావు, పాచిపెంట ఎంపీటీసీ ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. క్రీడాకారుల ప్రోత్సాహం నిమిత్తం వారికి పదివేల రూపాయలు పార్టీ అధ్యక్షులు యుగంధర్ అందజేశారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలచిన మడ్డు నూకరాజు అను క్రీడాకారుడికి మెడల్ వేసి అభినందించడం జరిగింది.

## సేవా కార్యక్రమాలతో సంతృప్తి

### తన పుట్టిన రోజు సందర్భంగా సామాజిక సేవలో డాక్టర్ హేమాక్షి





**పార్వతీపురం రూరల్, జనవరి11 : మేజర్ న్యూస్ :** మనం అందించే ఏ చిన్న సాయమైనా ఎంతోకొంత ప్రయోజనం ఉంటుందని సీతానగరం మండలం బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి. హేమాక్షి పేర్కొన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా పార్వతీపురం మండలం దాలి నాయుడు వలస గ్రామంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఆరోగ్య సమాచారం తెలుసుకొని తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా డా. హేమాక్షి మాట్లాడుతూ ప్రతీ ఏటా ప్రత్యేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పేదలకు మనం అందించే ఏ చిన్న సాయమైనా ఎంతోకొంత ప్రయోజనం చేకూరుతుందని, ప్రతీ ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాని హితవు పలికారు. మా సోదరుడు జిల్లా ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు వృత్తిలో, సేవలో మాకు ఎంతో స్ఫూర్తి దాయమని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం అక్కడ వారు డాక్టర్ హేమాక్షికు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందజేశారు.

# పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



**తెర్లాం, జనవరి 11 (మేజర్ న్యూస్) :** గ్రంథలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని గ్రంథలయ అధికారి సి.హెచ్.కృష్ణ మూర్తి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక గ్రంథలయంలో చదవడం మా కిష్టం అన్న కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు నీతి కథలు పొడుపు కథలు హాస్య కథలు చిత్రలేఖనం తదితర పుస్తకాలను చదివించారు. అలాగే చిల్డ్రన్ క్లబ్ ఏర్పాటు చేసి వివిధ రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు క్రాఫ్ట్ ఉపాధ్యాయులు కె.విస్సు పాఠకులు విద్యార్థులు పిల్లలు పాల్గొన్నారు.

అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# సేవా రత్న అవార్డు ప్రదానం



**బొబ్బిలి, జనవరి 11 (మేజర్ న్యూస్) :** అభిమాని ఫౌండేషన్ వారు మన ప్రగతి మన గ్రామానికి చేస్తున్న సేవలను గుర్తించి "సేవారత్న" అవార్డ్ ను మన ప్రియతమ నాయకులు మన గ్రామ ఆరాధ్యనేత బొబ్బిలి నియోజక వర్గ ఎమ్మెల్యే అయినటువంటి ఆర్ఎస్ఆర్కె రంగారావు (బేబీ నాయన) చేతులమీదుగా ఆదివారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి సభ్యులు పాల్గొనడం జరిగింది. నాడు మంచి విత్తనం నాటితే నేడు మంచి ఫలాలు ఇస్తుంది అనడానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ. ఈ అవార్డు గ్రామ ప్రజలకు, పెద్దలకు ,యువతకు అంకితం. భవిష్యత్తులో ఇంతకు రెట్టింపు విజయాలు సాధించాలని ఆశిద్దాం. ఈరోజు వేదికలో మన గ్రామం గురించి మన ప్రగతి గురించి గొప్పగా చెప్తుంటే గర్వంగా అనిపించింది.. ఇదే ఐక్యమత్యం తో ఇదే ఆశయంతో ఇదే స్ఫూర్తితో ముందుకి సాగుదాం అభివృద్ధి సాధిద్దాం.


# పడాల విజయం యువతకు ఆదర్శం



**భోగాపురం, జనవరి 12 (మేజర్ న్యూస్) :** బిగ్ బాస్ విజేత పడాల కళ్యాణ్ ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి విచ్చేసిన కళ్యాణ్‌ను కలసిన బంగార్రాజునీ ప్రతిభతో మన ప్రాంతాన్ని జాతీయ స్థాయిలో ఖ్యాతి తీసుకొచ్చావని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ ను దుస్సాలువాతో సత్కరించి అభినందించారు. నీ విజయం నేటి యువతకు ఎంతో ఆదర్శమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోటరావు, రాజు, బాల, చింతపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కార్టూన్ ప్రదర్శనలో బొబ్బిలి వాసి ఎంపిక






**బొబ్బిలి, జనవరి 11 (మేజర్ న్యూస్) :** తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో విదేశీ వలస పక్షులను స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్థానిక ఫ్లెమింగో క్లబ్ ఏర్పాటు చేసిన రేమింగో ఫెస్టివల్ లో అనేక కళారూపాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన నిన్నటి నుండి మూడు రోజులు పాటు ఉంటుంది. దీనిలో భాగంగా కార్టూన్ ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన అనేక ఎంట్రీలలో 61 ఎంట్రీలు ఎంపిక చేసి వాటితో కార్టూన్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్టూన్ ప్రదర్శనలో స్థానిక బొబ్బిలి కార్టూనిస్టు భాను, గుంట రెడ్డి భాస్కరరావు కార్టూన్ కూడా ఎంపికైంది. విదేశీ పక్షులు ఆతిథ్యంకాన్సెప్ట్ తో వేసిన ఈ కార్టూన్ పలువురి ప్రశంసలు పొందింది. ఈ కార్టూన్ ప్రదర్శన పట్ల స్థానిక సాహిత్య మిత్రులు అభినందించారు.

# సంక్రాంతి కానుకగా పిఆర్‌సిని తక్షణమే ప్రకటించాలి




## – ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు

**బొబ్బిలి, జనవరి11 (మేజర్ న్యూస్) :** ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఎంతగానో ఎదురు చూస్తున్న 12వ పిఅర్‌సిని సంక్రాంతి కానుకగా ప్రభుత్వం ప్రకటించి ఉద్యోగుల పక్షపాతి ప్రభుత్వమని నిరూపించుకోవాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపిటిఎఫ్ కార్యాలయంలో కార్యకర్తలతో అత్యవసర సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే పిఅర్‌సి, మధ్యంతర భృతి, డిఏ బకాయిలు, సరండర్ లీవ్ బకాయిలు ఎప్పుడెప్పుడు చెల్లిస్తారా అని రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు,పింఛను దారులుఎంతగానో ఎదురు చూస్తున్నారని కానీ నెలలు గడుస్తున్నా ప్రభుత్వం సంక్రాంతి సమీపిస్తున్న ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం విచారకరమని అన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులను విస్మరించటం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు గడచిన కాలంలో ప్రభుత్వాలు నూతన సంవత్సరం నాడో పర్వదినాలకో ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకొని ప్రకటించేవారని, మూడు నెలల క్రితం ఒక డిఏ ఇచ్చి ఆ డిఏతోనే అన్ని పండుగలు చేసుకోవాలన్నట్లుగా ప్రభుత్వ వైఖిరి ఉందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ విధానాలతో సర్కారు బడుల నిర్వీర్యం అవుతున్నాయన్నారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర కార్యక్రమాలు, మోయలేని పని భారం వల్ల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించి లేకపోతున్నారన్నారు బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు అప్పచెప్పొద్దని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిసిహెచ్ జి శర్మ, ఏ చిన్నారావు, యుగంధర్, అర్ఎన్ రాజు, అప్పారావు, ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న జనసేన క్రీడా సంబరాలు

## – విజేతలకు ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవానికి ఏర్పాట్లు





**పూసపాటిరేగ, జనవరి 11, మేజర్ న్యూస్ :** అత్యంత ప్రతిష్టాత్మకంగా జనసేన అధిష్టానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సూచన మేరకు క్రీడల నిర్వాహకులు కోట్ల రఘు నిర్వహించగా, పోటీలో తుది దశకు చేరుకొని సోమవారం ముగియనున్నాయి. క్రికెట్ పోటీలకు నియోజకవర్గ నలుమూలల నుంచి 85 జట్లకు పైగా వచ్చి హెూరాహెూరీగా పాల్గొన్నాయి. అదేవిధంగా వాలీబాల్ పోటీలు కూడా 47 జట్లు పాల్గొని ఫైనల్ మ్యాచ్లు సోమవారంతో ముగియనున్నాయి. మ్యాచ్ల ప్రారంభం నుంచి చివరి వరకు క్రీడాకారులకు అన్ని సదుపాయాలను కల్పించడమే కాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించే విధంగా జనసేన నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు ప్రత్యేక చొరవ తీసుకుని దగ్గరుండి పర్యవేక్షించారు. అతి సమర్థవంతంగా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి చేతుల మీదుగా అందించనున్నట్లు జనసేన నాయకుడు కోట్ల రఘు స్పష్టం చేశారు. అదేవిధంగా వాలీబాల్ పోటీలతో పాటు క్రికెట్ పోటీలలో గెలుపొందిన విన్నర్స్‌తో పాటు రన్నర్స్ కూడా నగదు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే లోకం నాగమధుడు చేతుల మీదుగా అందించునున్నట్లు క్రీడల నిర్వాహకుడు కోట్ల రఘు పేర్కొన్నారు.

# పండగ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా వుండాలి : ఎస్ఐ



**లక్క వరపు కోట జనవరి 11 మేజర్ న్యూస్)** మండలంలోని ప్రజలు భోగి మరియు సంక్రాంతి మరియు గ్రామ దేవతల తీర్థముల సందర్భంగా తమ యొక్క సొంత గ్రామాలకు వచ్చే టటువంటి ప్రజలందరు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలి అని ఎల్ కోట ఎస్ఐ నవీన్ పడాల్ సూచించారు పండగల సందర్భంగా మీరు మీ బంధువులు ఎవరైనా సరే ద్విచక్ర వాహనాల మీద గాని కుటుంబంతో పాటుగా మరియు ఒక్కరుగా బైక్ మీద వెళుతున్నట్లయితే తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలి అలాగే మీ దగ్గర ఉన్నటువంటి బంగారం మరియు ఇతర విలువైన వస్తువులు, డబ్బులు మొదలైన వాటిని సురక్షితంగా మీరు భద్రపరుచుకోవాలి అని అలాగే గ్రామ ప్రజలు గ్రామాలలో పండుగ సందర్భంగాఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహింఛి నట్లు తెలిస్తే పోలీస్ వారికి తెలియ చేయాలన్నారు మండలం లోని గేదెలవానిపాలెం, మల్లి వీడు, దాసుల్లపాలెం, గొలజాం, కళ్లేపల్లి, మొదలైన గ్రామస్తుల సహకారంతో ఆయా గ్రామాల్లో 30 జజ కెమెరాలు పెట్టడం జరిగిందని. దీని ద్వారా ఆయా గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రాంతాలకు చెందిన అపరిచిత వ్యక్తులు అయినా ఆయా గ్రామాలకు వచ్చినట్లయితే సిసి కెమెరాల ద్వారా సులభంగా వారిని గుర్తించడం జరుగుతుందిని. వీరిని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామా లలో సీసీ కెమెరాలు గ్రామ పెద్దలు మరియు దాత సహకారంతో ఏర్పాటు చేసుకొని గ్రామంలో ఏటువంటి దొంగతనాలు గాని మరియు అసాంఘిక కార్యక్రమాలు గాని జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా పోలీస్ వారికీ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు డ్రోన్ కెమెరాలు కూడా ఉపయోగించి నిఘాను పెంచుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం దాసులు పాలెం తదితరు గ్రామాలలో ఎస్ఐ పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# దోచుకున్నదెవరో బహిరంగ చర్చకు సిద్ధమా : వైసీపీ

## – 18 నెలల్లో ఎక్కడెక్కడ దోచుకున్నారో నిరూపిస్తాం – క్రెడిట్ చోరీ పథకంలో కూటమి నాయకులు సిద్ధహస్తులు



**చీపురుపల్లి జనవరి 11 మేజర్ న్యూస్ :** పట్టణంలోని రైల్వే వంతెన నిర్మాణ పనులకు సంబంధించి డిపిఆర్ లు మార్పులు చేసి అవినీతికి పాల్పడ్డారంటూ కూటమి నాయకులు, ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు వంటి వ్యక్తులు ఆరోపణ చేయడం సబబు కాదని వైసీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మీసాల వరహాల నాయుడు బెల్లాన బెల్లాన వంశీ తదితరులు మాట్లాడారు. దమ్ముంటే అవినీతి నిరూపించాలని సవాల్ విసిరారు. 18 నెలల పాలనలో ఎవరు ఎక్కడెక్కడ దోచుకున్నారో నిరూపిస్తాం బహిరంగ చర్చకు వచ్చే దమ్ముందా అంటూ వారు సవాల్ విసిరారు. వైసీపీ అధికారంలో ఉండగా స్థానిక శాసనసభ్యులుగా, మంత్రిగా బొత్స సత్యనారాయణ, పార్లమెంటు సభ్యునిగా బెల్లాన చంద్రశేఖర్ చేసిన కృషి ఫలితంగా సుమారు రూ.12.90 కోట్ల నిధులు రైల్వే బ్రిడ్జి నిర్మాణం కొరకు మంజూరు చేయించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి దక్కడంతో పాటు 80 శాతం పనులను వైసీపీ పాలనలోనే పూర్తి చేయడం జరిగిందని వారు వివరించారు. కూటమి పాలకులు 18 నెలలు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వారి పాలనలోనే బ్రిడ్జి పూర్తయినట్లు క్రెడిట్ చోరీ చేశారని ఆరోపించారు. కనీసం ఒక్క రూపాయి కూడా బ్రిడ్జి నిర్మాణం కొరకు కొత్తగా నిధులు మంజూరు చేసారా, బ్రిడ్జి ఏమైనా మార్పులు చేయించి బ్రిడ్జి ని వెడల్పు పెంచారా, బ్రిడ్జి నిర్మాణం విషయంలో కళా వెంకటరావు చేసినకృషి ఏంటో చెప్పాలని డిమాండ్ చేసారు. కూటమి పాలకులు హడావిడిగా ప్రారంభాలు చేసుకుని కనీసం ప్రోటోకాల్ పాటించలేదని వారు విమర్శించారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ నుంచి జిల్లా పరిషత్తు చైర్మన్ వరకు కనీస ఆహ్వానం లేకుండా హడావుడిగా ప్రారంభం చేయడం, ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకం కూడా ఏర్పాటు చేయలేకపోవడం దురదృష్టకరమన్నారు.

బ్రిడ్జి నిర్మాణమునకు డిపిఆర్ ను పలుమార్లు మార్పులు జరిపి అవినీతికి పాల్పడ్డారంటూ కూటమి పాలకులు చేస్తున్న ఆరోపణను తీవ్రంగా ఖండించారు. అవినీతికి ఎవరు పాల్పడింది ఎంతెంత ఎవరి దగ్గర దోచుకున్నది బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవారు విసిరారు. సీనియర్ నేతగా తెలుగుదేశం పార్టీలో గుర్తింపు కలిగిన కళా వెంకటరావు దిగజారుడు ప్రకటనలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. గతంలో ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన నియోజకవర్గాల్లో ప్రజలు ఎటువంటి అభివృద్ధి కానరాకపోవడంతో చీపురుపల్లికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. చీపురుపల్లి లో కూడా అదే కోవలో ఎటువంటి అభివృద్ధి పనులు జరపకుండా గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కేవలం 18 నెలలు కూటమి పాలనలో కళా వెంకటరావు రెండు మురికి కాలవలు, 3 సిమెంట్ రోడ్డు లు తప్ప ఈ నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి కార్యక్రమం ఏమైనా ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సారధ్యంలోని చీపురుపల్లి నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిందని ఈ సందర్భంగా వివరించారు. నిజంగా ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే గరివిడి మండలం కే ఎల్ పురం సంబంధించి రైల్వే బ్రిడ్జి నిర్మాణానం టెండర్స్ కూడా పూర్తి అయ్యాయని ,18 నెలల్లో పూర్తి చేస్తే తాము కూడా శభాష్ అంటూ చప్పట్లు కొడతామన్నారు. ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో ఆర్ ఈ సి ఎస్ ను తెస్తామని చెప్పి 18 నెలల గడిచిపోయాయి, రైతులకు, ప్రజలకి ఫలితమిచ్చే పనులు చేస్తే హర్షిస్తారని, వైసీపీ హయంలో చేసిన పనులను కూటమి చేసినట్టు చెప్పుకోవడం హుందాతనం కాదన్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు చౌకబారు ప్రసంగాలు మానుకొని అభివృద్ధి పైన దృష్టి సారించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో త్రినాథ, ఎంపీటీసీ గెరిడి రామదాసు, గవిడి సురేష్, రాంకీ, పోలయ్య, దన్నాన సత్యం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వైద్యం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



**రామభద్రపురం, జనవరి 11 (మేజర్ న్యూస్) :** రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాల యంలో కొత్తగా రూ.20లక్షలతో నిర్మించ నున్న ఆయుర్వే ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా అన్ని ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన సేవలు అందించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బెడ్ల సంఖ్య పెంచడానికి కూడా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా ఎన్ఆర్ఎస్ ద్వారా గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణాలకు చర్యలు చేపట్టామని అన్నారు. మిగిలిన అసంపూర్తి పనులు కూడా త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, జిల్లా టిడిపి పార్లమెంటల్ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు, ఎంపిటీసీ సభ్యులు భవిరెడ్డి చంద్రా, వసంతుల తిరుపతిరావు, పీఏసీఎస్ చైర్పర్సన్ చౌక్కాపూ విజయలక్ష్మీ, బొబ్బిలి ఏఎంసీ ఉపాధ్యక్ష ప్రతినిది గొర్రె రామారావు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు మూడడ్ల ఆదిలక్ష్మీ, మండల టీడీపీ క్లస్టర్ ఇన్చార్జ్ గంట సాయి, నర్సాపరం సర్పంచ్ కోట వెంకటనాయుడు, రామభద్రపురం సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, పీహెచ్సీ వైద్యాధికారి దిలీప్కుమార్, జన సేన నాయకులు పల్లె రమేష్, కనకల శ్యామ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురం నుండి తిరుపతికి సైకిల్ యాత్ర చేపట్టిన సీఎం చంద్రబాబు అభిమాని

## – ఎమ్మెల్యే విజయ్ చంద్రకు కృతజ్ఞతలు వికలాంగ యాత్రకుడు నెయ్యిల ప్రసాద్

**పార్వతీపురం, జనవరి 11 (మేజర్ న్యూస్) :** నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో మొక్కు తీర్చుకునేందుకు శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బోరగాం గ్రామానికి చెందిన నెయ్యిల ప్రసాద్ అనే వికలాంగుడు మూడు చక్రాల సైకిల్పై తిరుపతి యాత్ర చేపట్టారు. ఈ యాత్ర శనివారం రాత్రి పార్వతీపురం నియోజకవర్గం చేరుకోవడంతో వికలాంగ యాత్రకుడికి ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర వసతి ఆహారం వంటి సదుపాయాలను సమకూర్చారు. అలాగే ఆయనతో మాట్లాడి యాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర తన వంతుగా సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా యాత్రికుడు ప్రసాద్ మాట్లాడుతూ 2014లో తనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన చంద్రబాబు 2024లో ముఖ్యమంత్రి అయితే ఇచ్ఛాపురం నుండి తిరుపతి వరకు సైకిల్ పై వచ్చి మోకాళ్లపై తిరుపతి కొండమీదకి చేరుకుంటానని మొక్కు కున్నట్లు తెలిపారు. ఆ మొక్కు తీర్చుకునే క్రమంలో పార్వతీపురం వచ్చిన నాకు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్ని విధాలా సహాయ సహకారాలు అందించారని కృతజ్ఞతలు తెలియజేశారు.



## పాలకొండలో నగరపంచాయితీ అధికారుల నిర్లక్ష్యం



**పాలకొండ, మేజర్ న్యూస్ :** పాలకొండలో నగరపంచాయితీ అధికారులు మరోసారి ప్రజలపై పగ పట్టారు. ఎక్కడో మరణించిన గోవు శరీరాన్ని జనావాసాల మధ్యలో పడేసి చేతులు దులుపుకున్నారు. పాలకొండ నగరంలోని వెంకటరాయని కోనేరు ప్రాంతం నిత్యం జనం తిరుగుతూ ఉండేప్రాంతం గవర్నమెంట్ హాస్పిటల్ కు, ఆర్టీసీ బస్సు స్టాండ్కు చేరుకోడానికి ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తారు అటువంటి రద్దీగా ఉండే దారిమర్గంలో ఇప్పటికే పాలకొండ నగరపంచాయితీ అనధికారంగా మినీ డంపింగ్ యార్డు లాగా చెత్తను పడేస్తున్నారు. ఇక తాజాగా ఇదే ప్రాంతంలో మృతి చెందిన గోవును ప్రోక్లయినర్ సాయంతో తీసుకువచ్చి నడి రోడ్డుపై పడేసి చేతులు దులుపుకున్నారు. దీనిపై స్థానికులతో పాటు ఆ ప్రాంత కౌన్సిలర్ గంగునాయుడు నిరసన చేపట్టగా రోడ్డుపై ఉన్న మృతకలేబారాన్ని పక్కకు తోసేసారు కానీ అక్కడ నుండి తరలించలేదు. ఇక విషయం తెలుసుకున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు ఆ ప్రాంతానికి చేరుకొని నగరపంచాయితీ తీరును ప్రశ్నించారు. ఆవు అంటే గోమాతగా తల్లితో సమానంగా ప్రతి హిందువు చూస్తాడని కానీ నగరపంచాయితీ వారు ఆ గోమాత చనిపోతే ఖననం చెయ్యాల్సింది పోయి చెత్తలో పడేయడం హిందువులపై చేస్తున్న దాష్టికమని ఆర్ఎస్ఎస్ తెలిపింది. మీకు చేతకాకపోతే మా లాంటి సంస్థవాళ్లకు అప్పగించి ఉన్నా మేమే గోమాతను ఖననం చేసేవాళ్ళమని అలా కాకుండా హిందువుల మనోభావాలు దెబ్బ తీసేవిధంగా ఇటువంటి చర్యలు చేపట్టడంపై నగర పంచాయతీ కమీషనర్ వివరణ ఇవ్వాలని ఆర్ఎస్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. ఈ విషయంపై నిర్లక్ష్యం వహించిన నగరపంచాయితీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు పాలకొండ సబ్ కలెక్టర్కు ఆర్ఎస్ఎస్, బజరంగ్దళ్, విహెచ్పి కలిసి కోరతామని వారు తెలిపారు.

# సూర్యపీఠం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర





**పార్వతీపురం, జనవరి 11, మేజర్ న్యూస్ :** పార్వతీ పురంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం సూర్యపీఠంలో ఈనెల 23,24,25 తేదీలలో జరగనున్న వార్షికోత్సవం ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆదివారం ఆవిష్కరించారు. పీఠం ఆవరణలో పీఠాధిపతి నరహరి శాస్త్రి తదితరుల సమక్షంలో పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం పట్టణాన్ని ఇతర ప్రాంతాలకు ఉన్నతంగా పరిచయం చేయడం తన జీవిత లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ క్రమంలో సూర్యపీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు పట్టణానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటివరకు సూర్య దేవుని దర్శనానికి అటు కోణార్క్, ఇటు శ్రీకాకుళం వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు పార్వతీపురం లోనే సూర్యపీఠం అందుబాటులోకి రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మతాలకు కులాలకు అతీతమైన దేవుడు ఒక్క సూర్యభగవానుడు మాత్రమేనని, ఆధ్యాత్మికంగానూ సైన్స్ పరంగాను సూర్యునికి ప్రత్యేక స్థానం ఉందని స్పష్టం చేశారు. సూర్యపీఠం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఈ విషయంలో ఎప్పుడైనా తనను కలవవచ్చునని ఎమ్మెల్యే విజయ్ చంద్ర నిర్వాహకులకు సూచించారు.

## గవర గుంప స్వామి పరామర్శించిన ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర





**పార్వతీపురం, జనవరి 11, మేజర్ న్యూస్ :** టిడిపి పార్టీ నాయకులు గవర గుంప స్వామి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పరామర్శించారు. గుంప స్వామి తల్లి గవర సూరమ్మ స్వర్గస్తులయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఉదయం పార్వతీపురం మండలం చినమరికి గ్రామానికి చేరుకొని సూరమ్మ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. గవర సూరమ్మ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని వేడుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

## రాష్ట్ర విద్యా కమిటీ వైస్ చైర్మన్‌గా రవ్వా శ్రీనివాస్



**విజయనగరం టౌన్ , జనవరి 11, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర విద్యా కమిటీ వైస్ చైర్మన్ గా రవ్వా శ్రీనివాస్ ను నియమించారు. విజయనగరం జిల్లాలో ప్రముఖ వ్యాపారవేత్తగా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా శ్రీనివాస్ అందరికి సుపరిచితులు. ఈ సందర్భంగా ఆదివారం సంఘం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులందరికి మేలు జరిగే విధంగా ప్రణాళికలు నిర్మిస్తానని అన్నారు. ఫెడరేషన్ బలోపేతం చేయుటకు కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం లో శ్రీనివాస్ ఐవిఫ్ క్యాలెండరు ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ను రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి నాగరాజు,బండారు చంద్రశేఖర్, డిమ్స్ రాజు, బత్తుల కామేష్, సాయి తదితరులు కలసి అభినందనలు తెలిపారు.

## పండుగల సీజన్ సందర్భంగా యువతకు అవగాహన





**పాలకొండ, మేజర్ న్యూస్ :** పండుగలు ఆనందంగా, శాంతి యుతంగా జరుపు కోవాల్సిన సమయం. ఈ సమయంలో యువత చెడు అల వాట్లకు దూరంగా ఉండాలి. మద్యం, గుట్కా, ఖైనీ, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదు. ఇవి ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తాయి. వేగంగా వాహనాలు నడపడం, అల్లర్లు చేయడం, గొడవలకు దిగడం వంటి పనులు చేయకూడదు. పెద్దల మాటలు వినాలి, చట్టాన్ని గౌరవించాలి. స్నేహితులను కూడా మంచి మార్గంలో నడిపించాలి. పండుగలను కుటుంబ సభ్యులతో ఆనందంగా, సురక్షితంగా జరుపుకుని సమాజానికి మంచి సందేశం ఇవ్వాలి, అదేవిధంగా స్త్రీలు,చిన్నపిల్లలు, వృద్ధులకు ఏ సమస్య వచ్చినా 112కి కాల్ చేయగా తక్షణమే శక్తి బృందాలు సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను తెలుసుకొనిచట్టబద్ధంగా పరిష్కరిస్తాయని, ఆపద సమయంలో శక్తి యాప్ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేస్తూ జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాలలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తూ ప్రజలకు తెలియపరచడం అయినది, అదేవిధంగా నిర్మానుష్యమైన ప్రదేశాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు అగత్యాలు జరగకుండా కనిపెడుతూ, శక్తి టీం 3, ఇంచార్జ్ ఏ ఎస్ ఐ ఝాన్సీ భాయి, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ప్రకృతాంబ, కానిస్టేబుల్స్ శోభారాణి,రాము, గిరి ప్రసాద్ పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహించిన్నారు.

# సంతోషపురంలో పరిసరాలు పరిశుభ్రతకు చర్యలు

**– గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబటి రాంబాబు – జెసిబితో పరిసరాలు పరిశుభ్రం...సర్పంచ్ అంబటి రాంబాబు**

**– సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : సర్పంచ్ రాంబాబు**





**గరుగుబిల్లి, జనవరి 11,మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ సంద ర్భంగా మండల పరిధిలోని సంతోష పురం గ్రామ పంచాయతీలో ఆదివారం పరిసరాలు పరిశు భ్రతకు గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు) ఆధ్వ ర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలోని సంతోషపురం,పాత సంతోషపురం, ఖడ్గవలస, పిట్టలమెట్ట గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు పరిసరాలు పరి శుభ్రతకు అవసరమైన చర్యలు చేప ట్టడం జరిగిందని గ్రామపంచాయతీ సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు) తెలిపారు. అదే విధంగా గ్రామాల పరిధిలోని పలుచోట్ల రహ దారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను జెసిబితో తొలగించడం జరుగుతుందన్నారు.గ్రామ పంచా యతీలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని గ్రామ పంచా యతీ సర్పంచ్ అంబటి రాంబాబు తెలిపారు.మంచినీటి బోరు బావులు రక్షిత మంచినీటి పథకాల పరిసరా ల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా సమీపంలోని కాలువలోకి మళ్లించడం జరిగిందన్నారు.ప్రస్తుత సీజన్ లో గ్రామ పంచాయతీలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఉండేలా ఇప్పటికే గ్రామంలో పెద్ద ఎత్తున పారిశు ధ్యం మెరుగు పరచ డం జరిగిందని సర్పంచ్ అంబటి రాంబాబు పేర్కొన్నారు.ప్రస్తుతం గ్రామంలోని ఆయా వీధులలో పరి సరాలు పరిశుభ్రం చేసిన అనంతరం కాలువల్లో బ్లీచింగ్ ,ఫినాయిలు వేయించడం జరుగుతుందని పేర్కొ న్నారు.గ్రామ పంచాయతీలో వ్యాధు లు ప్రబల కుండా ఉండేందుకు మరియు దోమల నివారణకు గ్రామ పంచాయతీ పరిధిలో పలు చోట్ల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించేం దుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.గ్రామపంచాయతీలో పూర్తిస్థాయిలో పారిశుధ్య మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని సర్పంచ్ అంబటి రాంబాబు వెల్లడించారు.గ్రామ పంచాయతీలోని ఆయా వీధులలో ఎక్కడ చెత్త చెదారం లేకుండా ఉండేలా పరిసరాలు పరిశుభ్రం చేయ డం జరిగిందని తెలిపారు.దోమల నివారణకు కాలువల్లో ఎప్పటి కప్పు డు ఆయిల్ బాల్స్ వేయడం జరుగు తోందని పంచాయతీ సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు) తెలిపారు.

# మూడు రోజుల పండుగ... మురిపెమైన పండుగ మన "సంక్రాంతి"

**– జ్యోతిష్య ప్రవీణ వివిఎస్ఎల్ఎన్ శర్మ వెల్లడి – సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించిన వివిఎస్ఎల్ఎన్ శర్మ**

**– ఈనెల15 వ తేదీన మకర సంక్రాంతి పండుగ – సస్య కాంతి...సంక్రాంతి పండుగ – వివిఎస్ఎల్ఎన్ శర్మ వెల్లడి**





**గరుగుబిల్లి, జనవరి 11, మేజర్ న్యూస్ :** సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే రోజే సంక్రాంతి దక్షిణాయనం పూర్తయి ఉత్తరాయన పుణ్యకాలం ప్రవేశం సమయము కొనుక "ఉత్తరక్రాంతి" అని కూడా పిలుస్తారు. సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు...అలా ఏడాదికి 12 సంక్రాంతిలు వస్తాయి కానీ మకర సంక్రమణం నుంచి భాస్కరుడు ప్రచండ తేజస్సుతో ప్రకాశిస్తాడని వేమకోటి జ్యోతి షాలయం జ్యోతిష్య ప్రవీణ,వాస్తు ఆచార్య ,సంఖ్యాశాస్త్ర విశారద, సువర్ణ ఘంటా కంకణ ధారణ సన్మాన గ్రహీత మరియు ఆరామ ద్రావిడ సంఘ అధ్యక్షులు బ్రహ్మశ్రీ వేమకోటి సుబ్బలక్ష్మీనరసింహశర్మ వెల్లడించారు.

ఈసందర్భంగా సంక్రాం తి పండుగ విశిష్టతను బ్రహ్మశ్రీ వేమకోటి సుబ్బలక్ష్మీనరసింహశర్మ వివరించారు.దక్షిణాయనములో వర్షాలు, చలితో రోగాలు,వాతావరణ కల్లోలాలకు ముగింపు పలుకుతుంది ఉత్తరాయణం అని పేర్కొన్నారు. ఆరోగ్య కారకం,ఆహారసాధకం ఆనందదాయకం ఆధ్యాత్మిక పూరక మైన విశిష్ట కాలమిది.దక్షిణాయనం, పితృదేవతలకు ముఖ్యమైతే, ఉత్తరాయణం దేవతలకు ముఖ్య మైందని జ్యోతిష ప్రవీణ వేమకోటి సుబ్బలక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ముగ్గులు,గొబ్బె మ్మలు,బసవన్నలు, హరిదాసులు భోగి మంటలతో శోభాయమానమైన సంక్రాంతి సంబ రాలు గురించి ఎంత చెప్పినా తక్కువే...చెరకు గడలు కోలాటాలు బొమ్మల కొలువులు ఇవన్నీ మన తెలుగు వారికి సొంత మని తెలి పారు.బోగితో సంక్రాంతి పండుగ ప్రారంభమవుతుందన్నారు.ఈ కాలంలో వణికించే చలిని తరి మేందుకే ఈభోగి మంటలు వేయడం ఆచారమని తెలిపారు.దీనివల్ల సూక్ష్మ క్రిములు నశిస్తాయని వాతా వరణ కాలుష్యము దూరమవుతుం దని యజ్ఞ దేవతను స్మరిస్తూ ఆవు పేడతో చేసిన పిడకలు భోగిమంటలో వేస్తారు.

భోగి మంటలు అనంతరం అభ్యంగన స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించడంతోపాటు కొత్త బియ్యం, కొత్త బెల్లంతో పొంగలి వండి భగవంతునికి నివేధిస్తారని పేర్కొన్నారు.మూడు రోజుల పండుగలో అతి ముఖ్యమైనది సంక్రాంతి పండుగ ఉదయాన్నే సూర్యనమస్కారాలతో సంక్రాంతి ప్రారంభమవుతుందని చెప్పారు. సంక్రాంతి ముగ్గులు పండుగ రంగురంగుల రంగవల్లులతో లోగిల్లు కళకళలాడుతాయన్నారు.సంక్రాం తికి సంబంధించిన విషయాలన్నీ సూర్యుడితో ముడిపడి ఉంటాయని అదే విధంగా ఈపండుగలో గొబ్బెమ్మలదే ముఖ్య పాత్ర అని వెల్లడించారు. సంక్రాంతి మరుసటి రోజు కనుమ ఇది పశువులను పూజించే పర్వదినం రైతులు ఉదయాన్నే లేచి పశువులు శాలను, పశువులను శుభ్రం చేస్తారు.కుంకు మ బొట్లు అద్దడంతో పాటు పూల హారాలు వేసి పూజిస్తారు వండిన పొంగలిని భగవంతునికి నివేదించి కొంత పశువులకు తినిపిస్తారు. పశువుల శ్రమతోనే పంట తన చేతికి అందుతుందన్న కృతజ్ఞతా సూచి కంగా వాటిని పూజించి గౌరవించడం ఆనవాయితీగా వస్తుందని జ్యోతిష ప్రవీణ వి ఎస్ ఎల్ ఎన్ శర్మ తెలి పారు.సిద్ధాంతుల నిర్ణయం అదే విధంగా ధర్మశాస్త్రములు ప్రకారం ఈనెల 14వ తేదీన భోగి ,15వ తేదీన సంక్రాంతి పండుగ,16వ తేదీన కనుమ పండుగను నిర్వహించు కోవాలని వేమకోటి జ్యోతిషాలయం జ్యోతిష్య ప్రవీణ వాస్తు ఆచార్య సంఖ్యాశాస్త్ర విశారద,సువర్ణ ఘంటా కంకణ ధారణ సన్మాన గ్రహీత వేమకోటి సుబ్బ లక్ష్మీనరసింహశర్మ వివరించారు.

## ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవర్చుకోవాలి : గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూధనరావు



**గరుగుబిల్లి, జనవరి 11,మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్ర మంను నిర్వహించారు. ఈసందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమంతో పాటు విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం శాఖా గ్రంథాలయం నిర్వాహ కులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యా ర్థులకు ఉపయోగపడే పలురకాల పుస్తకాలు ఉన్నాయని వీటిని చదువుకోవాలని కోరారు.పోటీ పరీక్షలకు ఉపయోగ పడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రంథలయములో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాలు మేరకు నిర్వ హిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమమును విజయవంతంగా నిర్వ హించడంతో పాటు విద్యార్థులకు ఆటల పోటీలుతో పాటు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథలయ నిర్వాహకులు మధుసూదనరావు తెలిపారు.ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# చలపతిరావుకు ఉపాధ్యాయ రత్న జాతీయ అవార్డు



**అరకులోయ, జనవరి 11, మేజర్‌న్యూస్:** అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి.చలపతి రావుకు ఉపాధ్యాయ రత్న జాతీయ స్థాయి అవార్డు లభించింది.స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ క్రమశిక్షణ,పట్టుదల, విద్యాబోధనలో మెలకువలు, కళాశాల అభివృద్ధికి శ్రమిస్తున్న తీరును గుర్తించి సావిత్రిబాయి పూలే మెమోరియల్ ఆర్గనైజేషన్ ద్వారా ఉపాధ్యాయ రత్న జాతీయ అవార్డును ఆదివారం ప్రధానం చేశారు.విశాఖ మహానగరంలోని ప్రెస్ క్లబ్ లో ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ కె. కృష్ణమూర్తి ప్రిన్సిపాల్ కు అవార్డుతో పాటు సన్మాన పత్రం అందజేశారు.మహిళా విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కళాశాలను అభివృద్ధి పథంలో కొనసాగించడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్య అందిస్తున్నారని పలువురు ప్రముఖులు కొనియాడాతూ అవార్డును అందించి అభినందించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ రత్న జాతీయస్థాయి అవార్డు గ్రహీత,స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి. చలపతిరావు మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు.పలువురు ప్రముఖులు,మేధావుల సమక్షంలో ఇటువంటి గుర్తింపు అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఈ అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందని ఆయన చెప్పారు.తాను ఈ స్థాయికి ఎదగడానికి తల్లిదండ్రులు, గురువులే ప్రధాన కారకులన్నారు.వారికి జీవితాంతం రుణపడి ఉంటానంటూ పట్టాసి. చలపతిరావు కృతజ్ఞతలు తెలిపారు.గిరిజన ప్రిన్సిపాల్ ఉత్తమ అవార్డును అందుకోవడం పట్ల పలువురు గిరిజన ఉద్యోగులు,గిరిజన ప్రజాప్రతినిధులు,గిరిజన పాత్రికేయులు,గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సిబ్బంది అభినందించారు.

# గొట్టిపల్లి లో వాలీబాల్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కొత్తూరు, జనవరి 11, మేజర్‌న్యూస్:** పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం గొట్టిపల్లి ఆదివాసీ పంచాయితీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వాలీ బాల్ పోటీలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం ప్రారంభించారు. గొట్టిపల్లి పంచాయితీ ప్రథమ సర్పంచ్ స్వర్గీయ సూర్యనారాయణ పేరున ఈ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల్లో యువతను ప్రోత్సహిస్తుందని సంక్రాంతిని ప్రోత్సహించి మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇటువంటి టోర్నమెంట్ నిర్వహించడం సంతోషించ దగ్గ విషయమన్నారు. టోర్నమెంట్ లో పాల్గొన్న యువత ను ఎమ్మెల్యే గోవిందరావు ప్రోత్సాహించారు. క్రీడలు యువత లో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తా యని, ఈ గ్రామీణ స్థాయి క్రీడా పోటీలు యువత లో గల ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు.ప్రత్యేకంగా గిరి పుత్రుల సంక్షేమం, వారి ప్రతిభ కు గుర్తింపు కల్పించడమే లక్ష్యం గా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు క్రీడలు ప్రోత్సాహించేందుకు నిర్వాహకులకు ఎమ్మెల్యే 10 వేల రూపాయలు విరాళంగా అందజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ, మండల పరిషత్ నేత లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు , మాజీ సర్పంచ్ యల్ లక్ష్మీనారాయణ నాయుడు వాలిపల్లి వెంకటరమణ, ఇరపాడు సర్పంచ్ కోయిలాపు శ్రీనివాసరావు, పడాల వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



**ఆమదాలవలస, జనవరి 11, మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆముదాలవలస మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంక్రాంతి సందర్భంగా దుస్తులు, సబ్బులు, నూనెతో కూడిన అవసరమైన కిట్లను ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతను కాపాడటంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అమూల్యమైనదన్నారు. వారి సేవల వల్లనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. ఎండ, వర్షం అనే తేడా లేకుండా కాలానికి అతీతంగా ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న కార్మికులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆదుకుంటుందని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా కార్మికుల్లో ఉత్సాహం పెరిగిందని, తమ సమస్యలపై ప్రభుత్వం స్పందిస్తోందన్న నమ్మకం కలిగిందని పలువురు కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నూక రాజు, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి నమూనా పనులు అడ్డుకున్న గ్రామస్థులు

**నక్కపల్లి, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలం లోని చందనాడ గ్రామంలో ఆర్సీలాల్ మెట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ కంపెనీ వారు చేపడుతున్న మట్టి నమూనా పనుల ను చందనాడ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆదివారము చందనాడ ఎస్సీ కాలనీకి అనుకొని ఉన్న సర్వే నెంబర్ 51లో చెరువు పరిహారం ఎవరికి చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు.సర్వే నెంబర్ 65,135 మరిన్ని నంబర్లు లా పరిహారం ఎవరికి చెల్లించారో తెలిపారు.అప్పటివరకు ఇక్కడ పనులు నిలిచి వేయాలని పట్టుపట్టారు.



# నబంధుపురంలో డిబిపిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్




**మెలియాపుట్టి, జనవరి 11, మేజర్‌న్యూస్:** మెలియాపుట్టి మండలంలోని దీనబంధుపురం యూత్ ఆధ్వర్యంలో ఇందిరా క్రికెట్ టోర్నమెంట్ ను మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గం జనసేనపార్టీ నాయకురాలు కొరికాన భవాని సౌజన్యంతో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం అన్నారు. క్రీడల ద్వారా శారీరిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ ఐక్యత నాయకత్వ గుణాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలి తప్ప, వ్యక్తిగత భావ ద్వేషాలకు పోకుండా మంచి స్నేహ భావంతో ఈ క్రీడలు సాగించాలని తెలియజేశారు, యువతకు ఆదర్శం స్వామి వివేకానంద వారి యొక్క బోధనలు వారి యొక్క అడుగుజాడల్లో నడవాలన్నారు. యువత క్రీడల్లో రాణిస్తూ సన్మార్గంలో ముందుకు వెళ్లి భవిష్యత్తులో గొప్ప పేరు ప్రఖ్యాతలు సాధించాలని, యువత దేశానికి రథసారథుల అన్నారు. ఈ కార్యక్రమంలో పొలాకి మురళీకృష్ణ పత్రి మణికంఠ, పోలాకి దిలీప్ కుమార్, కొల్లి రోహిత్ కుమార్ ,బాబురావు, పదనాపురం కృష్ణరావు, సాలింటి వెంకటేష్ , కమిటీ సభ్యులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం




**శ్రీకాకుళం, జనవరి 11, మేజర్‌న్యూస్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా సహకారంతో శ్రీకాకుళం పట్టణం టౌన్ హాల్స్ సమీపంలో ఉన్న సెయింట్ థమస్ చర్చి, కాన్ఫరెన్స్ విన్సెంట్ డిపాల్ సొసైటీ నందు ఫాదర్ =వజ. బోనెల. రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించబడినది. 20 మంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు యొక్క రక్తము వలన సకల మానవాళికి పాప విమోచన రక్షణ ఇవ్వబడినదని మనుషుల మైన మనము తోటి తోటి సహచరులు ప్రాణాపా పరిస్థితిలో ఉన్న ఎడల ఇచ్చే కొద్దిపాటి రక్తము ఒక వ్యక్తిని కుటుంబాన్ని కాపాడుతుంది అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టబడిన. మన జీవిత కాలంలో ఒక ప్రాణాన్ని కాపాడితే అదే మహాభాగ్యము. చైర్మన్ పి జగన్ మోహన్ రావు మాట్లాడుతూ రక్తం కొరత చాలా అధికంగా ఉందని ఈ సమయంలో రక్తదానం చేయడం ప్రాణాలు కాపాడడం బృహత్తర కార్యక్రమం అని అన్నాడు. ఈ సందర్భంగా రక్తదాన శిబిర నిర్వాహకులను మరియు దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో =వజ. కార్నివాల్ ప్రెసిడెంట్ ఆనందరావు, విన్సెంట్ డి పాల్ సొసైటీ ప్రెసిడెంట్ ఎల్ లక్ష్మణరావు, సభ్యులు వెల్సన్, అనిల్, మాధవ రెడ్ క్రాస్ ప్రతినిధులు కే సత్యనారాయణ పి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాడ్రాపల్లి స్వాములు పాదయాత్రతో సింహాచలం



మునగపాక, జనవరి 11, మేజర్‌న్యూస్: మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో 41 రోజు లుసింహాద్రి అప్పన్న మాల వేసి దీక్ష ఆదివారంతో ముగించడంతో పాదయాత్రగా వాడ్రాపల్లి నుండి సింహాచలం కొండపైగుడి వరకు నడుచుకుంటూ వెళ్లడం జరుగుతుంది ఈ యొక్క సింహాద్రి అప్పన్న స్వాములకు కర్రీ సాయి కృష్ణ గారు రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి పండ్లు ఫ్రూటీలు ఈ యొక్క సింహాద్రి అప్పన్న 60 మందిస్వాములకు ఇవ్వడం జరిగినది, ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు సింహాద్రి అప్పన్న ఇలవేల్పుగా కొలుస్తూ, ప్రతి ఏటా మాలలు ధరించి, భారీ అంబలం పూజలు ఏర్పాటు చేసే, ఆధ్యాత్మిక దైవచింతన, కార్యక్రమంలో వాడ్రాపల్లి ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరహా నర్సింగరావు, పారుపల్లమ్మ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ మల్ల కనుమ నాయుడు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆడారి బాలాజీ,మండల తెలుగు రైతు అధ్యక్షుడు మల్ల శేషు గురు స్వామి,మల్ల శంకరు,మొల్లేటి రవి,ఆడారిబాలాజీ, మల్ల అప్పలనాయుడు,కొణతాల అప్పారావు, భారీ స్థాయిలో గ్రామ పెద్దలు స్వాములు మహిళలు యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనులపై డ్రోన్ నిఘా



అనకాపల్లి, జనవరి 11, మేజర్‌న్యూస్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నెలకొంటున్న ట్రాఫిక్ రద్దీని పరిష్కరించే దిశగా అనకాపల్లి ట్రాఫిక్ పోలీసుల శాఖ డ్రోన్ ను రంగంలోకి దించింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి పర్యవేక్షణలో ఆదివారం నాడు అనకాపల్లి పట్టణంలో డ్రోన్ సహాయంతో పర్యవేక్షించారు. అత్యంత రద్దీగా ఉండే ఫోర్ రోడ్ జంక్షన్, కొత్తూరు జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ప్రవాహాన్ని గగనతలం నుండి డ్రోన్ల ద్వారా నిశితంగా పరిశీలించారు. ఎక్కడ వాహనాలు ఎక్కువగా నిలిచిపోతున్నాయి? ఎక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు? అనే అంశాలను డిజిటల్ విజువల్స్ ద్వారా అధికారులు విశ్లేషించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో ట్రాఫిక్ నిర్వహణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయితే డ్రోన్ ఇచ్చే విజువల్స్ ద్వారా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని క్లియర్ చేస్తారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ఈ నిఘా ఎంతగానో తోడ్పడుతుందని, ఆధునిక సాంకేతికతను జోడించడం వల్ల సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగపు సిబ్బంది, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన



మునగపాక, జనవరి 11, మేజర్‌న్యూస్: మండలంలోతిమ్మరాజుపేట గ్రామంలో ఎస్ఐ పి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ క్రైమ్ , మోసాలపై, అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఎస్సై పి.ప్రసాదరావు మాట్లాడుతూ యువత కూడా చెడు మార్గాలలో ప్రయాణించరాదని, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్, సి బుక్, లేకుండా ప్రయాణం చేయరాదని అన్నారు,సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా ఉండాలని అదేవిధంగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంక్రాంతి సందర్భంగా ఏదైనా బహుమతి గెలుచుకున్నారు అని సైబర్ నేరగాళ్లు నుండి ఫోన్లు వస్తే వాటికి ఎటువంటి స్పందించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు,. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణ, లీల కృష్ణ, మూర్తి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మునగపాకలో మేలుకొలుపు కార్యక్రమం



మునగపాక, జనవరి 11, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన మునగపాకలో ఆదివారం వేకువ జామున రామాలయం నుంచి భక్తులు శ్రీరామ శ్రీరామ అంటూ భజన చేసుకుంటూ గ్రామ పురవీధుల్లో తిరుగుతూ ప్రజల ను మేలుకొలుపుతూ సంతబయల శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద కాంగ్రెస్ మణికంఠ, దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసి తమ భక్తిని చాటుకున్నారు, ధనుర్మాసం సందర్భంగా నెల గంట పట్టినపుడు నుండి నేటి వరకు మేలుకొలుపు కార్యక్రమం ప్రతిరోజు చేస్తూ భగవంతుని సేవలో పిల్లలు పెద్దలు వృద్ధులు పాల్గొంటున్నారు.

## స్వయంగా ట్రాక్టర్ నడుపుతున్న జనసేన పార్టీ నాయకుడు ఆనంద్



మునగపాక, జనవరి 11, మేజర్‌న్యూస్: మండలంలో ఉమ్మలాడ గ్రామంలో పారిశుద్ధ్యంతో, చెత్త,చెదారం, గ్రామంలో పేరుకుపోవడంతో ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకువెళ్లి, వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయగా, శని, ఆదివారాలలో పారిశుద్ధ్య కార్మికులతో పనిచేస్తూ, వారిని ఉత్సాహపరుస్తూ, చెత్త ట్రాక్టర్ ని స్వయంగా నడిపి గ్రామ పొలిమేర దూర ప్రాంతానికి చెత్తను తరలించారు, గ్రామంలో ఎవరికి ఏ పని ఉన్నా, ఏ సమస్య వచ్చిన నేనున్నానంటూ ముందుకు వచ్చే వ్యక్తిగా ప్రజలలో మొల్లేటి ఆనంద్ పేరు సంపాదించారు, ఆనంద్ తండ్రి మొల్లేటి గంగు నాయుడు( ఎం జి నాయుడు ) గ్రామ ఉప సర్పంచ్ గా, గౌరీ సంఘం అధ్యక్షునిగా, ఏ వన్ కాంట్రాక్టర్, గా, ఉన్నతమైన పెద్ద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా, పేరు ప్రతిష్టలు సంపాదించిన ఎంజి నాయుడు కుమారునిగా మొల్లేటి ఆనంద్ కూటమి ప్రభుత్వం సహకారంతో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆశీస్సులతో రేపు రానున్న స్థానిక ఎన్నికలలో సర్పంచ్ బరిలో దిగి విజయం సాధించే విధంగా మొల్లేటి ఆనంద్ వ్యూహం రచిస్తున్నాడు.

## అబిద్ నగర్ లో ముగ్గుల పోటీ



విశాఖపట్నం, జనవరి 11, మేజర్‌న్యూస్: అక్కయ్య పాలెం అబిద్ నగర్‌లో ఉషోదయ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ కోయిలాడ నవ్య ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గులపోటీ నిర్వహించారు .ఈ పోటీలలో జేతలగా మొదట బహుమతి దివ్య ,2 వ బహుమతి శ్యామల, 3వ బహుమతి సంధ్య 4వ బహుమతి సాధించగా పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రత్యేక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# కశింకోట ప్రజలకు పోలీస్ హెచ్చరిక..

### - సంక్రాంతి పండుగకి ఊరికెళ్తున్నారా తస్మాత్ జాగ్రత్త - కశింకోట సీఐ అల్లు స్వామి నాయుడు



కశింకోట, జనవరి 11, మేజర్‌న్యూస్: సంక్రాంతి పండగకి ఊరికి వెళ్తున్నారా తస్మాత్ జాగ్రత్త కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి అని స్థానిక సీఐ అల్లు స్వామి నాయుడు అన్నారు. జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా, డీఎస్పీ ఎం.శ్రావణి ఆదేశాలమేరకు స్థానిక సీఐ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ఊరికి వెళ్లాల్సి వస్తే వారు విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవలన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు అని తమతో పాటే తీసుకెళ్లాలని సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం ఏర్పాటు చేసుకోవలన్నారు. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్‌స్టేషన్ లో సమాచారం ఇవ్వండి అన్నారు. వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం అని అన్నారు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిదన్నారు. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్, సెక్యూరిటీ గార్డ్, సర్వెంట్ గా నియమించుకోవాలని మీ ఇంట్లో సీసీ కెమరాలు పెట్టినట్లు అయితే దాని ద్వారా ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని పరిసర ప్రాంతాలను లైవ్ లో ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు అన్నారు. ఊరికి వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలన్నరు. ఎట్టి పరిస్థితులలో సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టవద్దు అన్నారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకి, దయల్ 100 కి సమాచారం అందించాలి అని అన్నారు. కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ, సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుంది తెలిపారు.

## సూర్య పత్రిక కేలండర్ ఆవిష్కరించిన

**– టెక్కలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు : బెండి నర్సింగరావు**



**టెక్కలి, జనవరి 11, మేజర్‌న్యూస్:** సూర్య పత్రిక క్యాలెండర్ ను ఏపీయుడబ్ల్యూజె టెక్కలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బెండి నర్సింగరావు ఆదివారం టెక్కలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రతినిధి జర్జాన రాంజీ,టెక్కలి రిపోర్టర్స్ కూన రమేష్, తేజ, ఈశ్వర్, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఒంగ్రుజోల క్రికెట్ సంబరానికి ఎమ్మెల్యే రవికి ఆహ్వానం





**కొత్తూరు, జనవరి 11, మేజర్‌న్యూస్:** సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని ఒంగ్రుజోల లో ఈ నెల 13 న నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి రావాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ను యం పి హెచ్ డవలపర్స్ అధినేత బామిడి రాజు ఆహ్వానించారు. తన తల్లి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మెగా టోర్నమెంట్ ముగింపు సమావేశనికి ముఖ్య అతిధిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే కూన రవిని కలసిన వారిలో గుంపు ధరల సింగ్ భాస్కరరావు పడ్డ లోకేష్, జంక శంకరరావు , అరుబోల దశరథ రావు,నిమ్మగడ్డ తేజ రేగాన ఆదినారాయణ కోర్నాల అమ్మల నాయుడు గవర అప్పల నాయుడు తదితరులు ఉన్నారు.

## పూడిమడక సముద్రంలో మత్స్యకారుడు గనగల్ల సత్తియ్య (45) గల్లంతయ్యారు



**అచ్చుతాపురం, జనవరి 11, మేజర్‌న్యూస్:** మెరైన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూడిమడక గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులతో కలిసి తెల్లవారు జామున నెంబరు ఐఎన్డీఏపీవీ 3ఎమ్ఎ01252 గల బోట్పై చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి ఒడ్డుకు చేరుకునే సమయంలో మధ్యాహ్నం సుమారు 1.45గంటలకు సముద్రపు అలల ఉధృతికి ఒక్కసారిగా ఫైబర్ బోటు బోల్తా పడింది. దీంతో నెమ్మదిగా ఆరుగురు మత్స్యకారులు బోటును ఆశ్రయించి బోటులోకి చేరుకున్నారు. సముద్రంలో పడి గల్లంతైన సత్తియ్య ఆచూకీ తెలియలేదని తోటి మత్స్యకారులు తెలిపారు. మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ ఎస్.సింహాద్రి నాయుడు తెలిపారు. అచ్యుతాపురం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రామ్మోహన్ చొరవతో స్వదేశానికి..

**– ఉద్యోగాల పేరుతో మయున్మార్ చేరుకొని మోసపోయిన ఆంధ్రా తెలంగాణ యువకులు – తమ కష్టాన్ని వీడియో రూపంలో రామ్మోహన్ నాయుడుకు పంపించిన బాధితులు – చలించిపోయిన కేంద్ర మంత్రి, ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు విముక్తి – స్వస్థలాలకు చేరుకొని ఆనందం వ్యక్తం చేస్తున్న మయున్మార్ బాధితులు**



**శ్రీకాకుళం, జనవరి 11, మేజర్‌న్యూస్:** కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో.. మయున్మార్ దేశంలో చిక్కుకున్న భాదితులు తిరిగి భారత దేశానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మంచి ఉద్యోగ హామీతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సుమారు ఇరవై ఏడు మంది యువకులు కొద్ది నెలల క్రితం మయున్మార్ చేరుకున్నారు. అయితే ఇచ్చిన హామీ ఒకటి వారికి అక్కడ అందుతున్న ఉపాధి మరో రకంగా ఉండేది. భాదితులు తెలిపిన వివరాల ప్రకారం వారికి మయున్మార్ లో తమను బలవంతపు సైబర్ స్కాం, శారీరక దుర్వ్యవహారాలు, ఇతర ఇబ్బందులకు గురి చేసారని తమ కష్టాలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెంతకు వీడియో రూపంలో చేర వేశారు. తప్పుడు వాగ్దానంతో తమను మయున్మార్ తీసుకువెళ్ళారని, ఇప్పుడు సరిహద్దులో ట్రాఫికింగ్ అయ్యామని తమ గోడు చెప్పుకున్నారు. వారి పరిస్థితి చూసి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చలించిపోయారు. వారికి ఉపశమనం కలిగేలా చర్యలు ప్రారంభించారు. మయున్మార్ లో చిక్కుకున్న 27 మంది భారతీయులను సురక్షితంగా తిరిగి తీసుకురావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ జై శంకర్ కు లేఖ రాసారు. ఆ తర్వాత విదేశాంగ మంత్రిత్వ శాఖ, యాంగోన్‌లోని భారత రాయబారి కార్యాలయం వేగంగా చర్యలు తీసుకుని, శనివారం రోజున భాదితులను సురక్షితంగా తిరిగి భారత్ కు తీసుకొచ్చారు. శనివారం ఉదయం న్యూ డిల్లీకి చేరుకున్న బాధితులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చేందుకు పూర్తి తోడ్పాటు అందించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ధన్యవాదాలు తెలుపారు. కాగా తిరిగి రాష్ట్రానికి రాబడ్డ వ్యక్తులు రాము గున్నుగుకెల్లి, సాయి కుమార్ కనకవల, అజయ్ దుబ్బా, జగదీశ్ సాహు, బ్రహ్మాజి అలుగోలు, భువనేష్ గండబోయిన, దినేష్ గండబోయిన, ధనుంజయ రావు గువ్వల, చిను దీపక్ మొరదబూడి, శ్రీహర్ష అల్లు, జయకృష్ణ చటాల, జి. రామకృష్ణ, ఎస్.ఏ. నజ్మా బేగం, అరునేంద్ర మతి, మస్తాన్ గగ్గుతూరి, జస్వంత్ కుమార్ రెడ్డి, చైతన్య కుమార్ రెడ్డి, జాయ్ విఘ్నాన్ సలగల, విజయ్ కుమార్ ఇసుకపాటి, సాయి నికేష్ దేవర, రమేష్ పల్లెబోన, రాకేష్ మంటి, తేజశ్వి తుంగ, మురళి, బి. చిన్న మల్లయ్య, ఎమ్. సుమ లక్ష్మి, జె.శేఖర్ బాబు లు కాగా వీరంతా విజయనగరం, విశాఖపట్నం, అన్నమ్మయ్య, హైదరాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందివవారు. వారికీ వారి స్వస్థలాలకు వెళ్ళే ఏర్పాటును డిల్లి నుండి అక్కడి అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతీ భారతీయుని భద్రత, గౌరవం, శ్రేయస్సు కాపాడటానికి, కష్టాల్లో ఉన్నవారికి తోడ్పాటును అందిచేందుకు కూటమి సర్కారు ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

## కోడిపందాలపై గట్టిగా నిఘా



**రణస్థలం, జనవరి 11, మేజర్‌న్యూస్:** ఎస్పీ కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు రణస్థలం మండలం అక్కయ్యపాలెం, నారువ, మెంటాడ, కోటపాలెం, చిల్లపేట రాజాం, మొరువాడా గ్రామాల్లో కోడిపందాలు మరియు పేకాటలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో డ్రోన్ తో చెక్ చేయడం జరిగింది.

## వంశ మూలాలను గుర్తుకు తెచ్చుకునే పండగే సంక్రాంతి

**– నారాయణ స్కూల్లో సంక్రాంతి సంబరాలు**



**రణస్థలం, జనవరి 10, మేజర్‌న్యూస్:** నారాయణ స్కూల్ కోస్టా నందు ముందస్తు సంక్రాంతి వేడుకలు ప్రారంభమైనవి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త కెల్ల రమణ మాట్లాడుతూ సనాతన సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ విద్యార్థి దశ నుంచే విలువలతో కూడిన విద్యను అందించడం అభినందనీయం, విద్యార్థులలో ఉన్న చెడు భావాలను ,చెడు అలవాట్లను భోగి మంటలో వేయమని చెప్పారు. పెద్దలపట్ల గౌరవంతో ఉండటం అవసరమని వంశానికి మూలమైన తాత, ముత్తాత, అమ్మ మొదలగు వారిని స్మరించుకోవాలని వంశమూలాలను గుర్తుకు తెచ్చుకోవాలని చెప్పే పండగే ఈ పెద్దల పండగ సంక్రాంతి. పశు పక్షాదులకు ఆహారం అందించి పశువులను కూడా శ్రద్ధతో చూడాలని చెప్పే పండగే కనుమ. అని ఈ భోగి, సంక్రాంతి, కనుమ పండగలలో అంతరార్థాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరై చక్కని నృత్య ప్రదర్శనలు, గొబ్బెమ్మలు, రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద్, ప్రిన్సిపాల్ ఎస్. గౌరి నాయుడు మరియు ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

## వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



**సంతబొమ్మాళి, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలో మరువాడ పంచాయతీ దిబ్బలు మరవాడ గ్రామానికి చెందిన బైపిల్లి రామారావు(55) అనే మత్స్యకారుడు సముద్రం వేటకు వెళ్లి ఆదివారం మృతిచెందాడు. మృతుడితో పాటు మరో ఇద్దరు మత్స్యకారులు కలిసి సముద్రపు వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా అలలు ఉధృతకు బోటు బోల్తా పడింది. ఈ క్రమంలో ప్రమాదమస్తు బైపిల్లి రామారావు మృతిచెందగా మిగిలిన ఇద్దరు మత్స్యకారులు గంట లోకేష్, సురాడ కొర్లయ్య సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. మృతుడికి భార్య ,ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## చినకోవిరిపేట గ్రామం లో పేకాట శిబిరం పై దాడి



**పోలాకి, జనవరి 11, మేజర్‌న్యూస్:** పోలాకి మండలం చినకోవిరి పేట గ్రామం లో పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 4620 రూపాయలు స్వాధీనం చేసుకొని ఆరుగురు వ్యక్తులపై పోలాకి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు పోలాకి ఎస్సై రంజిత్ తెలిపారు.

# సబ్బవరంలో శ్రీ రేంజర్స్ మార్క్

**- ఇంటర్ చదువుతోపాటు డిఫెన్స్ జాబ్స్ - కాకినాడ ఓపెన్ లో 22 మంది స్టూడెంట్స్ ఎంపిక - అకాడమీపై ప్రసంశల జల్లు - గ్రేట్ అంటున్న జిల్లా ప్రజలు**




**అనకాపల్లి, జనవరి 11, మేజర్‌న్యూస్:** భావిభారత విద్యార్థుల భవిష్యత్ పై దృఢమైన సంకల్పంతో దేశ సేవకు యువతను సిద్ధం చేస్తూ, ఎందరో యువకులను రక్షణ శాఖలో చేర్చి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నది మన సబ్బవరంలోని శ్రీ రేంజర్స్ అకాడమీ. ఇంటర్మీడియట్ విద్య ఎంపీసీ, బైపీసీ లతోపాటు అర్మీ, నేవీ, ఎయిర్ఫోస్ వంటి త్రివిధ దళాలల్లోకి వెళ్లేందుకు విద్యార్థులకు శిక్షణ అందిస్తుంది. సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే రహదారికి ఆనుకొని ఎన్టీఆర్ జంక్షన్ వద్ద విశాలమైన క్రీడామైదానం, చక్కటి వాతావరణంలో పిల్లలకు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో విద్యను నేర్పిస్తూ దేశానికి సేవ చేసే అదృష్టాన్ని కైవసం చేసుకునేందుకు శిక్షణ ద్వారా అవకాశం కలుగజేస్తుంది. ఇటీవల కాకినాడలో జరిగిన ఓపెన్ ర్యాలీ ఎంపికలో ఆర్మీ విభాగంలో ఏకంగా 22 మంది శ్రీ రేంజర్స్ అకాడమీ విద్యార్థులు ఎంపిక అవ్వడం పట్ల విద్యార్థుల కుటుంబ సభ్యులతో పాటు జిల్లా ప్రజలు ప్రసంశల వర్షం కురిపిస్తున్నారు. రాబోయేకాలంలో మరెందరినో ఈ అకాడమీ నుంచి దేశ సేవకు పంపించాలని ఆశీర్వదిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.శ్రీ రేంజర్స్ జూనియర్ కళాశాల అండ్ డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ పోతల సత్యనారాయణ, డైరెక్టర్ తాండ్రంగి సూర్య ప్రకాష్, పీడీ ఎక్స్.ఆర్మీ సుబ్రమణ్యం, శ్రీనివాస్ లను విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వినోద్ బాబు తదితరులు ఈ సందర్భంగా అభినందించారు.

## కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**: ఎస్సై పి ప్రసాద్ రావు**



**మునగపాక, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలో నాగవరం, మల్లవరం, వెంకటాపురం, తదితర గ్రామాలలో ఎస్పి తుహాన్ సినహ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై పి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఏ ఎస్ ఐ నాగేశ్వరరావు ఈ గ్రామాలలో ప్రజలకు,యువతకు, మహిళలకు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఎస్సై పి ప్రసాదరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలకు, అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ప్రజలందరూ సంక్రాంతి పండుగను సంతోషంగా కుటుంబ సభ్యుల వారితో ఆనందంగా జరుపుకోవాలని పోలీస్ శాఖ తరపున తెలియజేస్తున్నామని అన్నారు, ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణ, లీలా కృష్ణ, గణేష్, శివ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి పెద్ద పీట

**- అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కి**

**అనకాపల్లి ప్రతినిధి, జనవరి 11, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి అన్నారు. ఆదివారం మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గ, అనకాపల్లి మండలం, శంకరం, తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాల 09 మంది లబ్ధిదారులకు గాను 4,20,000/- రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కుల ను జనసేన పార్టీ అనకాపల్లి ఇంచార్జ భీమరశెట్టి రామ్కి లబ్ధిదారు కుటుంబం ఇంటి వద్దకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఆపరేషన్లు చేయించుకోలేని నిరుపేదలకు, ఖరీదైన వైద్యం పొందలేని రోగులకు కొండంత అండగా, అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి అని అన్నారు. ఈ 18 నెలలకాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందల మందికి



సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ సహాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాంకీ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మండల కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి తనిఖీలు



**- డ్రోన్ల సహాయంతో సరిహద్దు ప్రాంతాలలో గగనతల సర్వే - పండగల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు... రూరల్ సీఐ రేవతమ్మ**

**నర్సీపట్నం, జనవరి 11, మేజర్‌న్యూస్:** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం, నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీమతి రేవతమ్మ , మాకవరపాలెం ఎస్.ఐ. పి. దామోదర్ నాయుడు గొలుగొండ ఎస్.ఐ. పి. రామారావు,జిల్లా స్పెషల్ టీమ్ సిబ్బంది మరియు మాకవరపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టామని రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. మాకవరపాలెం - రావికమతం - రోలుగుంట సరిహద్దు ప్రాంతాలలో మెగా డ్రైవ్ నిర్వహించి, డ్రోన్ల సహాయంతో గగనతల సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించి, పోలీస్ బృందాలను ప్రత్యేకంగా విభజించి, పర్యవేక్షణ చేపట్టడం జరిగింది. అలాగే, జె.నాయుడుపాలెం, తూటిపాల, బుచ్చయ్యపాలెం తదితర పరిసర గ్రామాలలో కూడా డ్రోన్ సర్వే నిర్వహించి, అనుమానాస్పద కదలికలపై నిఘా కొనసాగించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేస్తున్నారు. కోడిపందాలు, గుండాట. పేకాట వంటి జూద కార్యకలాపాలు, అలాగే ఇతర ఏవైనా అసాంఘిక మరియు చట్ట విరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనడం చట్టరీత్యా నేరం. ఇలాంటి చర్యల్లో ఎవరైనా పాల్గొన్నట్లు గుర్తిస్తే, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అని సిఐ హెచ్చరించారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని, ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు వెంటనే తెలియజేయాలని పోలీస్ అధికారులు కోరారు.

# ఘనంగా నాగులపల్లిలో హిందూ సమ్మేళనం



**మునగపాక, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలోని నాగులపల్లి గ్రామంలో కాశి అన్నపూర్ణమ్మ ఆలయ ప్రాంగణం వద్ద ఆదివారం సాయంత్రం అతిథులుగా పరమహంస పరిరాజకులు పూజ్య శ్రీ స్వామి శ్రీనివాసనంద సరస్వతి స్వామి హాజరైనారు, మరో అతిధి నల్లూరు శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత భయ్యా వాసు పాల్గొన్నారు, అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుండి హనుమాన్ శోభాయాత్ర ద్వారా ఊరేగింపుగా వచ్చి, సభా వేదికపై జ్యోతి ప్రజల్వన తో ప్రారంభించారు, శ్రీ స్వామి శ్రీనివాసనంద సరస్వతి మాట్లాడుతూ కులాలు, ప్రాంతాలు,పార్టీలు, వేరైనా, మనమంతా హిందువులనే అనే భావనతో జీవించినప్పుడు మన దేశాన్ని ధర్మాన్ని ఆలయాలను కాపాడుకోగలుగుతామని అన్నారు, ప్రముఖులు బొడ్డెడ శివాజీ , సైంటిస్ట్ చదర శివాజీ,ఆధ్యాత్మిక వేత శరగడం పరదేశి నాయుడు,శ రగడం జగన్మోహన్రావు, నాయకులు టెక్కలి పరుశురాం, ఎల్లపు భాస్కరరావు, నిర్వహకులు ఎం జగదీష్, కర్రి వాసు, మల్ల ఉమా మహేష్, మల్ల కాళేశ్వరరావు, దొడ్డి రాము, బొడ్డెడ భాస్కర్ రావు, ఆడారి యోగేశ్వరరావు, కాండ్రేగులు ఈశ్వర మాస్టారు, పాటిమీద శ్రీరామ భజన మహిళా బృందం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయిని నాగజ్యోతికి ఉపాధ్యాయ రత్న అవార్డు




**రావికమతం, జనవరి 11, మేజర్‌న్యూస్:** మండలంలో కొత్తకోట గ్రామానికి చెందిన పివిఎం నాగజ్యోతి కి విశాఖపట్నం చెందిన సావిత్రిబాయి పూలే ఆర్గనైజేషన్ ఉపాధ్యాయ రత్న అవార్డుతో సత్కరించింది. ఈ సంస్థ ఉపాధ్యాయ వృత్తిలో బహుముఖ ప్రజ్ఞ కనపరిచిన ఉపాధ్యాయనీలకు ప్రతి ఏటా అవార్డులు ఇచ్చి సత్కరిస్తుంది. దీనిలో భాగంగా కొత్తకోట గ్రామానికి చెందిన నాగజ్యోతి ప్రస్తుతం రోలుగుంట హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. ఈమె ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి మండల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డులు అందుకుంది. దీనితోపాటు వెయిట్ లిఫ్టింగ్ లో జాతీయ అంతర్జాతీయ అవార్డులు సాధించింది. వాసవి క్లబ్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది. దీనిని గుర్తించిన సింహం సావిత్రిబాయి పూలే సంస్థ విశాఖపట్నంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయ రత్న బిరుదు తో సత్కరించింది.

# సేఫ్ జోన్ షాప్‌లో ప్రమాదం



## : టెక్నీషియన్ మృతి

**పరవాడ, జనవరి 11, మేజర్‌న్యూస్:** స్థానికంగా ఉన్న సేఫ్ జోన్ షాప్‌లో ఆదివారం జరిగిన ప్రమాదంలో అక్కడ పనిచేస్తున్న సర్వీస్ టెక్నీషియన్ మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మృతుడు మామిడి సూర్యప్రకాశ్ రావు (45 ), కాకినాడకు చెందిన వ్యక్తి. ఆయన గత మూడు నెలలుగా పరవాడలోని సేఫ్ జోన్ షాప్‌లో పని చేస్తున్నారు. ఈ సంస్థకు కాకినాడ మరియు పరవాడలో రెండు బ్రాంచ్‌లు ఉన్నాయి. ఇతను 5 సంవత్సరాల నుంచి కాకినాడలో పని చేస్తూ ఇటీవల ఇక్కడికి వచ్చాడు. ఫార్మా కంపెనీలకు సరఫరా చేసే ఫైర్ ఎక్స్టింగ్విషర్లకు సర్వీసింగ్ చేయడం, రీఫిల్లింగ్ చేయడం ఈ సంస్థ యొక్క పని. సాధారణంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్ సిలిండర్‌లో సగం వరకు డ్రై ఎక్స్టింగుషెట్టింగ్నే పౌడర్ నింపి, మిగతా సగం నైట్రోజన్ గ్యాస్‌తో నింపుతారు. ఆదివారం డ్రై పౌడర్ నింపిన అనంతరం నైట్రోజన్ గ్యాస్ నింపే సమయంలో గ్యాస్ అధికంగా నింపబడినట్లు అనుమానింప పడుతుందని. దాంతో సిలిండర్‌లో అధిక ఒత్తిడి ఏర్పడి అకస్మాత్తుగా సిలిండర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో మామిడి సూర్యప్రకాశ్ రావు తీవ్రంగా గాయపడగా, వెంటనే కేజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పండుగకు కాకినాడ వెళ్లాలనే ఉద్దేశంతో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి సెలవు దినమైన ఆదివారం కూడా విధులకు హాజరయ్యాడని సమాచారం. ఈ సంఘటన ఈ రోజు మధ్యాహ్నం జరిగిందని తెలిపారు.మృతునికి భార్య వనిత రత్నంతో పాటు 16 మరియు 13 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పరవాడ పోలీసులు బంధువులకు తెలియజేశారని కేసు నమోదు చేసి సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

# ప్రపంచ దేశాలలో ఆర్థిక రాజకీయ సంక్షోభాలు వస్తాయని ముందుగానే చెప్పిన లక్కోజు శివరామ



**విశాఖపట్నం, జనవరి 11, మేజర్‌న్యూస్:** ఉత్తర దక్షిణ అమెరికా ఇతర దేశాలలో రాజకీయ ఆర్థిక సంక్షోభాలు వచ్చి ఇరుగుపొరుగు దేశాలతో అమెరికాకు సఖ్యత లోపిస్తుందని తాను ముందుగానే అంచనా వేసి చెప్పినట్లు ప్రముఖ వాస్తు జ్యోతిష్యులు బ్రహ్మశ్రీ విశ్వకర్మ లక్కోజు శివరామ ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకార ముహూర్తాన్ని బట్టి జ్యోతిష్య శాస్త్రంలోని నవగ్రహ సంచారము గోచారము పరిశీలన చేయగా అమెరికా అధ్యక్షుడు ఏకపక్ష నిర్ణయాల వల్ల అనేక దేశాలతో నిత్యం గొడవలు నిరసనలు ఉంటాయని కొత్త కొత్త వ్యాధులు వస్తాయని అనేక దేశాలపై ట్రంప్ టారిఫ్ పెంచుకుంటూ పోతాడని, 27 జనవరి 2025వ తేదీన ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను చెప్పినట్లుగానే జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. మెక్సికో, క్యూబా, కొలంబియా, భారత్, చైనా వంటి దేశాల పై 500% టారిఫ్ పెంచే అవకాశాలు ఉన్నాయని టారిఫ్ల పై వచ్చేవారం ఓటింగ్ జరిగే అవకాశం ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఈనెల 15వ తారీకు నుండి గోచారం పరిశీలన చేయగా రూపాయి క్షీణత మినరల్స్, మెరైన్ ప్రొడక్ట్స్, సి ఫుడ్స్, ఐటి ఎక్సపోర్ట్స్, టెక్స్టైల్స్, జెమ్స్ అండ్ జ్యువెలర్స్, బంగారం లలో హెచ్చుతగ్గులు ఉంటాయనీ, శాస్త్ర సాంకేతిక సమస్యలు ఇంటర్నెట్లో ఆటంకాలు నిర్మాణం రంగం స్టాక్ మార్కెట్లు కుదేలవుతాయనీ, దేశాల మధ్య రాకపోకలలో ఆంక్షలు ఉంటాయని, తెలియజేశారు ముఖ్యంగా భారతదేశ చుట్టూ ఉన్న దేశాలతో అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. నేడు శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ప్రయోగించబోయే పిఎస్ఎల్వి 62 ప్రయోగం విజయవంతం అవుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# విశాఖ పోలీసుల పనితీరు ప్రశంసించిన సీఎం చంద్రబాబు

- పోలీసుల అదుపులో మహిళపై దాడి కేసు నిందితుడు - మానసిక స్థితి సరిగ్గా లేదని ప్రాథమికంగా నిర్ధారణ

- స్పష్టమైన ఆధారాలు లేకున్నా కేసు ఛేదించిన పోలీసులు - విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదన్న సీఎం



**విశాఖ క్రైం, జనవరి 11, మేజర్‌న్యూస్:** విశాఖలో ఓ మహిళపై జరిగిన దాడి వెనుక వాస్తవాలను ఛేదించి, నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న విశాఖ నగర పోలీసులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. రెండు రోజుల క్రితం విశాఖలో విజయదుర్గ అనే మహిళను జగదాంబ సెంటర్‌లో ఓ వ్యక్తి దాడి చేసి, దుర్భాషలాడినట్టు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు... ఈ ఘటనకు కారణమైన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే అతని మానసిక పరిస్థితి బాగోలేదని ప్రాథమిక విచారణలో తేలింది. సంఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి, వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం, నిందితుడి గుర్తింపు వివరాలు తెలియకపోయినా, కేసును ఛేదించడంపై బాధిత మహిళ సంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించారని చెప్పారు. సదరు మహిళ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఆ వ్యక్తి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని నిర్ధారించుకున్నారు. అతన్ని మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కోరారు. అలాగే నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని బాధితురాలు విజ్ఞప్తి చేశారు. విశాఖలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయనేందుకు ఇది నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పనితీరును ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళలకు రక్షణ విషయంలో దేశంలోనే విశాఖ మొదటి స్థానంలో ఉందని, భవిష్యత్‌లోనూ ఎటువంటి ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఇదే సమయంలో ఇలాంటి ఘటనలపై రాజకీయం చేస్తూ, ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

# గ్రామీణ యువతకు పోలీసులు అవగాహన

- కోడిపందాలు, పేకాట, గుండ్లాటలు నిషేదం

- రూరల్ ఎస్ఐ రవికుమార్



**అనకాపల్లి, జనవరి 11, మేజర్‌న్యూస్:** చట్టవ్యతిరేక కార్యకలాపాలపై గ్రామీణ ప్రాంత యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత యువత, పోలీసులు స్నేహ భావంతో మెలగాలన్నారు. ఏ సందర్భంలోనైనా అసాంఘిక కార్యకలాపాలు ఎదుటపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి పండుగకు గ్రామాలు కుటుంబ సభ్యులతో కల కలాడుతుంటాయని, సాంప్రదాయ వస్త్రధారణతో యువత ఆదర్శంగా, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, గుండ్లాటలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే సమాచారమివ్వాలని యువతను ఈ సందర్భంగా ఆయన కోరారు. పండుగల సమయంలో గ్రామస్థులు కుటుంబ సమేతంగా ఊరులు వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తద్వారా గ్రామాల్లో పోలీసుల గస్తీ నిర్వహిస్తామని వివరించారు.

# వివేకానంద జాతీయ పురస్కారం అందుకొన్న అంపిలి

**కొత్తూరు, జనవరి 11, మేజర్‌న్యూస్:** వివేకానంద జాతీయ ప్రతిభ పురస్కారాన్ని కొత్తూరు మండలం గూనభద్ర గ్రామానికి చెందిన అంపిలి ప్రశాంత్ అందుకున్నారు. వివేకానంద 163 జయంతి సందర్భంగా విజయవాడ లో పాన్ ఇండియా సోషియా అసోసియేషన్ నిర్వహించిన స్వామి వివేకానంద జాతీయ ప్రతిభ పురస్కార ఉత్సవంలో భాగంగా విజయవాడ లో ఆంధ్రప్రదేశ్ తరుపున నార్త్ అమెరికా ప్రత్యేక ప్రతినిధిగా నూతనంగా నియమితులైన తానా పూర్వ అధ్యక్షులు జయరామ్ కోమటి చేతులు మీదుగా ప్రశాంత్ ప్రతిభ పురస్కారన్ని తీసుకొన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు క్రింద ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు కు ఎంపిక చేసినందుకు పాన్ ఇండియా సోషియా అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



# యువత ఉత్తమ ఆశయాలతో ముందడుగు వేయాలి

- ఎన్ఎస్ఎస్ ముగింపు శిబిరంలో ఐఏఎస్ అధికారి సాధు శిభి చక్రవర్తి..

**నరసన్నపేట, జనవరి 11, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండలం జమ్ము గ్రామంలో జ్ఞాన జ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేఘాలయ ఐఏఎస్ క్యాడర్ అధికారి సాదు శిబి చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని లక్ష్యం వైపు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుండి సామాజిక స్పృహతో విద్యార్థుల అందిస్తున్న సేవలను అభినందించారు. ఉత్తమ లక్ష్యాలు సాధనకు విద్యార్థులందరూ కృషి చేయాలని, ఉన్నత ఉద్యోగ సాధనకు అవసరమైన నిరంతర శ్రమను కొనసాగిస్తూ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని, మాతృభూమి సేవకు ముందు వరుసలో ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణారావు, పిఓ అప్పారావు, అధ్యాపక బృందము పాల్గొన్నారు.

# నగరంలో టాస్క్‌ఫోర్స్ దూకుడు

**• పేకాట శిబిరం, కోడి పందాలపై మెరుపు దాడులు**





**విశాఖ క్రైం, జనవరి 11, మేజర్‌న్యూస్:** విశాఖ నగరంలో అక్రమ కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.సీపీ శంఖబత్ర బాగ్చి ఆదేశాలతో మెరుపు దాడులు చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక దాడుల్లో పేకాట శిబిరం, కోడి పందాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పంజా విసిరారు.రైల్వే న్యూ కాలనీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ దాడుల్లో పది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1,30,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన నిందితులను మరియు స్వాధీనం చేసిన నగదును నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.వీరిపై కేసు నమోదు చేసిన సీఐ ఉమాకాంత్ దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా,భీమిలీ పోలీసు స్టేషన్ పరిధిలో ముల‌కుద్దు ప్రాంతంలో నిర్వహిస్తున్న అక్రమ కోడి పందాలపై కూడా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు కోళ్లు, రూ. 1,050 నగదును స్వాధీనం చేసుకున్నారు.భీమిలీ పోలీసులు అప్పగించచన టాస్కోర్స్ వీరిపై కేసులు నమోదు చేశారు. అక్రమ జూదం, పందేలపై ఎలాంటి సడలింపు ఉండదని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. నగరంలో అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.

# అక్రమ కార్యకలాపాలపై పెందుర్తి పోలీసుల ఉక్కుపాదం

**• పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్**

**• రూ.32,200 నగదు స్వాధీనం**



**పెందుర్తి, జనవరి 11, మేజర్‌న్యూస్:** రాబోయే పండుగలను ప్రశాంతంగా,శాంతియుతంగా నిర్వహించేందుకు పెందుర్తి పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. పెందుర్తి సీఐ కె.వి. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో కోడిపందాలు, పేకాట,గుల్లాట వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా నాలుగు స్పెషల్ పోలీసు టీంలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఎస్.ఆర్.పురం గ్రామ శివారు ప్రాంతంలో నిర్మానుష్యం ప్రదేశంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పణంగా పెట్టి పేకాట (కోతముక్కాట) ఆడుతున్నట్లు సమాచారం అందడంతో, స్పెషల్ టీం సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకుని, వారి వద్ద నుండి పందెం కాసిన నగదు రూ. 32,200 ను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు తావు లేదని స్పష్టం చేశారు. కోడిపందాలు, పేకాట, గుల్లాట వంటి నిషేధిత చర్యలకు పాల్పడే వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని పెందుర్తి పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయగలమని పోలీసులు తెలిపారు.

# సంక్రాంతి కానుక ఎక్కడ బాబూ..!

**● 31వ వార్డు బాపు ఆనంద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ● ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**

**పూర్ణమార్కెట్, జనవరి 11, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ సంక్రాంతి కానుక ఎక్కడ అని వైసీపీ మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ సమన్వయ కర్త వాసు పల్లి గణేష్ కుమార్ సూటిగా ప్రశ్నించారు. 31 వ వార్డు సరస్వతి పార్క్ కనకల దిబ్బ వీధిలో వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసుపల్లి ముఖ్యఅతిథిగా హాజరై వివిధ సంస్కృతిక



సాంప్రదాయ కార్యక్రమాలు ఆటలు పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు వాసుపల్లి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ సర్కార్ అందజేసిన కంది పప్పు సైతం ఇవ్వలేని అసమర్థ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఎంతో గొప్పగా చెప్పిన రు 20 కిలో గోధుమ పిండి కేవలం పట్టణాల్లోనే అది కూడా అరకొరగా ఇస్తున్నారని మండి పడ్డారు. రేషన్ డిపోలో కేంద్రం ఉచిత బియ్యం ఇస్తుందని గుర్తు చేశారు. కూటమి కేవలం పంచదార రాగులు మాత్రమే ఇవ్వడం విడ్డురం అన్నారు. గత వై ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముఖ్యమైన పండగలకు కిలో పంచదార ఇచ్చేవరని పేర్కొన్నారు. తెలుగు ప్రజల పెద్ద ప పండగ సంక్రాంతి అన్నారు. బంధుమిత్రులు స్నేహితుల అనుబంధానికి ప్రతీక ఈ పండగ అన్నారు. పట్టణాల్లో కూడా సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతుంది అని సంతోషం వ్యక్తం చేశారు. గాలిపటాలు పిల్లలతో పాటు పెద్దలకు కూడా ఎగురావేయడం సంప్రదాయం అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో నాగరాజు, మోహన్, గంట శ్రీను, నాయుడు, బాబురావు, రాము మాస్టర్, ధోని, త్రినాధ్, కనుకులు, రామ, దుర్గ, సత్య, మహేష్,సౌత్ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బేవర మహేష్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



## వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా

# సీపీ ఘన నివాళులు



**(విశాఖ క్రైం : మేజర్ న్యూస్)**

స్వాతంత్ర్య సమరయోధుడు, ధైర్య సాహసాలకు ప్రతీక అయిన వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి,పోలీస్ కమిషనరేట్ ఆవరణలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ వడ్డే ఓబన్న స్మరించుకుంటూ వడ్డే ఓబన్న సామాజిక న్యాయం,స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని, ఆయన ధైర్యం, త్యాగం నేటి తరాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. సామాజిక సమానత్వం, న్యాయం కోసం వారు చేసిన పోరాటం ప్రతి ఒక్కరినీ ప్రేరేపించేదిగా ఉందని అన్నారు. వడ్డే ఓబన్న ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

# రౌడీషీటర్ల కు పెందుర్తి పోలీసులు కౌన్సెలింగ్..



**పెందుర్తి, జనవరి 11, మేజర్‌న్యూస్:** పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం సీఐ సతీష్ ఆదేశాలతో ఎస్సై లక్ష్మీ రౌడీ షీటర్ల కు కౌన్సిలింగ్ ఇచ్చారు.ప్రతి రౌడీషీటర్లు కదలికపై నిరంతరం పోలీస్ సర్వేలెన్స్ ఉందని, అసాంఘిక,చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని అలాగే వారి ప్రవర్తన కుటుంబ సభ్యులపై కూడా ప్రతిఫలిస్తుందని గమనించాలని, సమాజంలో మంచి వ్యక్తులుగా మారేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అలాగే, తప్పుదారులు విడిచిపెట్టి, సమాజ హితానికి తోడ్పడే విధంగా నడుచుకోవాలని, చట్టానికి లోబడి జీవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సలహా ఇచ్చారు.ఈ కౌన్సిలింగ్‌లో రౌడీషీటర్లకు ప్రోత్సాహకరమైన మాటలతో,మంచి భవిష్యత్తు కోసం మార్పు అవసరాన్ని వివరించారు.